



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 74 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా ఆదివారం 25 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 74 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST SUN 25 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## అమెరికాలో మంచు తుపాను విలయతాండవం...

### 16 రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ, 8,000 విమానాలు రద్దు!

- అమెరికాను ముంచెత్తుతున్న భారీ మంచు తుపాను
- దాదాపు 20 కోట్ల మంది ప్రజలపై తీవ్ర ప్రభావం
- 16కు పైగా రాష్ట్రాల్లో స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ విధింపు
- వారాంతంలో 8,000కు పైగా విమాన సర్వీసులు రద్దు
- పలు ప్రాంతాల్లో విపత్తు స్థాయి మంచు పేరుకుపోయే ప్రమాదం

**పెన్ పవర్ డెస్క్:**అమెరికా చరిత్రలోనే అత్యంత తీవ్రమైన మంచు తుపానుల్లో ఒకటి దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. టెక్సాస్ నుంచి న్యూ ఇంగ్లాండ్ వరకు సుమారు 2,000 మైళ్ల విస్తీర్ణంలో ఈ తుపాను ప్రభావం చూపుతుండటంతో అగ్రరాజ్యం గజగజ వణికిపోతోంది.

- మిగతా 2లో...



## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ...

### ఇద్దరు మావోలు అరెస్ట్

- దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మెంబర్ సాల్మన్, ఆయన భార్య అరెస్ట్
- అచ్చంపేటకు వచ్చిన మావోయిస్టు దంపతులు
- అరెస్ట్ చేసిన నాగర్ కర్నూలు పోలీసులు

**పెన్ పవర్ డెస్క్:**ఇప్పటికే వరుస ఎన్ కౌంటర్లు, లొంగుబాట్లతో భారీగా దెబ్బతిన్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్, మిలిటరీ

- మిగతా 2లో...

## నా మిత్రుడు అనునిత్యం నగరి కోసం తపించేవారు

- కుప్పం తరహాలో నగరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం హామీ
- 2029 నాటికి నగరికి కృష్ణా జలాలు తీసుకువస్తానని వెల్లడి
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరిలో సీఎం చంద్రబాబు పర్యటన
- రాష్ట్రవ్యాప్త సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- వలసలు నివారించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని స్పష్టీకరణ



**పెన్ పవర్ డెస్క్:**చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గాన్ని తన సొంత నియోజకవర్గమైన కుప్పం తరహాలో అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. 2029 ఎన్నికల నాటికి నగరికి కృష్ణా జలాలను తీసుకొచ్చి సాగు, తాగునీటి కష్టాలు తీర్చే బాధ్యత తనదని ఆయన స్పష్టం చేశారు. స్థానిక యువత ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా పరిశ్రమలను తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. శనివారం నగరిలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ అభివృద్ధిపై కీలక హామీలు ఇచ్చారు. నగరితో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, "నగరి తెలుగుదేశం పార్టీకి కంచుకోట. నా మిత్రుడు, దివంగత నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఈ ప్రాంత ప్రజల కోసం నిరంతరం తపించేవారు. గడిచిన ఐదేళ్లలో ఇక్కడ అభివృద్ధి ఆగిపోయింది. ఇప్పుడు మళ్లీ మంచి రోజులు మొదలయ్యాయి" అని వ్యాఖ్యానించారు. పేదల అభ్యున్నతి కోసం చేపట్టిన పీ4 (పేదరికంపై గెలుపు) కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులను కూడా సీఎం సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ నాయుడు, ఎంపీ డి.ప్రసాదరావు తదితర నేతలు, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వ్యర్థాల సేకరణ కోసం రూపొందించిన 'స్వచ్ఛ రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన మెప్మా, డ్వాక్రా మహిళల ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి వారిని అభినందించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ పలువురిని సన్మానించారు.

"స్వచ్ఛాంధ్ర అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు, అది మనందరి జీవన విధానం కావాలి. ఏడాది క్రితం ఒక ఉద్యమంలా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ప్రతి నెలా మూడో శనివారం నేతలు, అధికారులు పాల్గొంటున్నారు. ప్రజలంతా భాగస్వాములైతేనే దీని లక్ష్యం నెరవేరుతుంది" అని పిలుపునిచ్చారు. సమైక్యాంధ్రలో సీఎంగా ఉన్నప్పుడు తాను ప్రారంభించిన జన్మభూమి, పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాలను ఆయన గుర్తుచేశారు.

## సినీ గ్లామర్ తో రాజకీయాల్లో విజయం సాధించడం సాధ్యం కాదు

### కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ



- ఎన్టీఆర్ తర్వాత సినీ ఇమేజ్ మీదే నిలదొక్కుకున్న ఉదాహరణలు లేవన్న వర్మ
- సమస్యలపై పోరాటమే రాజకీయాల్లో అసలైన బలం అని వ్యాఖ్య
- పవన్ బలమైన ప్రజా నాయకుడిగా ఎదిగారని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**సినిమా గ్లామర్ ఒక్కటే ఆధారంగా పెట్టుకుని రాజకీయాల్లో దీర్ఘకాల విజయం సాధించడం సాధ్యం కాదని కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస్ వర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్టీఆర్ తర్వాత కేవలం సినీ ఇమేజ్ మీదే రాజకీయాల్లో నిలదొక్కుకున్న ఉదాహరణలు లేవని స్పష్టం చేశారు. ప్రజలతో మమేకమయ్యే నాయ కత్వం, వారి సమస్యలపై పోరాటమే రాజకీయాల్లో అసలైన బలం అని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మాత్రం భిన్నంగా చూడాలన్నారు. పవన్ కల్యాణ్ కేవలం సినీ నటుడిగానే కాకుండా, ప్రజల మధ్య ఉండే బలమైన ప్రజా నాయకుడిగా ఎదిగారని శ్రీనివాస్ వర్మ ప్రశంసించారు. ప్రజా సమస్యలపై నేరుగా పోరాడటం, ప్రజలతో సన్నిహితంగా మెలగడం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. అలాగే, కూటమిగా కలిసి

- మిగతా 2లో...



## విదేశాల్లో భారత్ 'వాంటెడ్'.. రెండేళ్లలో 70 మంది గుర్తింపు

- 'వాంటెడ్' జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నారు: కేంద్ర ప్రభుత్వం
- పరారీలో ఉన్న వారి గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందన్న కేంద్రం
- ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నట్లు వెల్లడి
- వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గత ఏడాది తిరిగి వచ్చినట్లు వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**గత రెండేళ్లలో 'వాంటెడ్' జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నట్లు గుర్తించామని కేంద్ర ప్రభుత్వం ఒక నివేదికలో తెలిపింది. వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి, పరారీలో ఉన్న వారిని గుర్తించే ప్రక్రియ

- మిగతా 2లో...

## బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉంది



- బాలికల పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్న కందుల దుర్గేశ్
- వారు ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా తీర్చిదిద్దాలని వ్యాఖ్య
- వారి భద్రత విషయంలో నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**సమాజంలో బాలికల భద్రత, వారి చదువు, ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. నిడదవోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'జాతీయ బాలికా దినోత్సవం' కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా

- మిగతా 2లో...

## బాలికలే భవిష్యత్ దీపికలు



**పెన్ పవర్ డెస్క్:**జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. బాలికలే భవిష్యత్ దీపికలని పేర్కొన్నారు. 'సరైన నైపుణ్యాలు, అవకాశాలు కల్పిస్తే బాలికలు ఆకాశమే హద్దుగా రాణిస్తారు. వారి హక్కులు, విద్య, భద్రత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. బాలికలపై వివక్షను విడనాడదాం.. వారికి సమాన హక్కులు కల్పిద్దాం" అని లోకేశ్ అన్నారు.

## భారత్ పై తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..!



- భారత్ పై 50 శాతం సుంకాలు వసూలు చేస్తున్న అమెరికా
- ఇటీవల రష్యా నుంచి కొనుగోళ్లు తగ్గించిన భారత్
- 25 శాతం టారిఫ్ లు తగ్గించనున్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి హింట్

**పెన్ పవర్ డెస్క్:**భారత్ పై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్ లు తగ్గించే యోచనలో ఉన్నట్లు అగ్రరాజ్యం సంకేతాలు వెలువరించింది.

- మిగతా 2లో...



## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

- ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి
- యువతకు అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్న మోదీ
- వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# ప్రతీ చోటా జగనన్న సైన్యం... పక్కా వ్యూహం !

వైసీపీ అధినేత గత ఇరవై నెలలుగా తాను తెర వెనకన ఉంటున్నారు. పార్టీని ముందు పెడుతున్నారు. ప్రతీ ఆందోళనను పార్టీ నాయకులు చేసేలా చూస్తున్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం కాకుండా ఈ మధ్యన చేసిన ఆందోళన చాలా వరకూ సక్సెస్ అయింది. కోటి సంతకాల పేరుతో పార్టీలో కొంత చైతన్యం వచ్చింది. అయితే 2024లో ఓటమి తరువాత నుంచి జగన్ చేస్తున్నది చెబుతున్నదీ ఒక్కటే. పార్టీని పటిష్టంగా ఉంచాలని. పార్టీ బాగుంటేనే అంతా బాగుంటారు అని. అందుకే ఆయన కమిటీల మీదనే ఫుల్ ఫోకస్ పెట్టేశారు.

**బూత్ లెవెల్ నుంచి :**

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ లెవెల్ నుంచి కమిటీలు వేయమని జగన్ ఆయా నియోజకవర్గం ఇంచార్జిలను కోరుతూ వస్తున్నారు. ఈ కమిటీలు కూడా కేవలం మొత్తం అనుబంధ సంఘాలతో కలిపి వేయమంటున్నారు. అంటే మహిళ, యువత, విద్యార్థి, కార్మిక, రైతు విభాగాలు అన్న మాట. ఇలా అధ్యక్షుడు ఒకరు, ఉపాధ్యక్షులు ఇద్దరు, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రటరీలు ఇద్దరు, కోశాధికారి ఈ విధానంలో కమిటీలు వేసుకుంటూ వెళ్తే బూత్ లెవెల్ లోనే కనీసంగా ఒక యాభై మంది దాకా క్యాడర్ కి పదవులు దక్కుతాయి, వారంతా అక్కడ పార్టీ సైన్యంగా ఉంటారు అని లెక్క వేస్తున్నారు. అక్కడ నుంచి వార్డు, అలాగే పంచాయతీ స్థాయి, మండలాలు, నియోజకవర్గాల దాకా ఈ కమిటీలు ఉంటాయి. దీంతో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసంగా 15 వేలకు తక్కువ కాకుండా జగనన్న సైన్యం తయారు అవుతుందని అంటున్నారు.

**పదవ వంతుగా :**

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు కనీసంగా లక్షన్నర నుంచి రెండు లక్షల మంది దాకా ఉంటారు. ఆ లెక్కన తీసుకుంటే అందులో పదవ వంతుగా వైసీపీ సైన్యం ఉంటారు అన్న మాట. ప్రతీ పది మంది ఓటర్లకు ఒక వైసీపీ కమిటీ మెంబర్ అన్నట్లుగా వైసీపీ అధినాయకత్వ ఈ రాజకీయ నిష్పత్తిని ఎంచుకుంది. వీరు కనీసంగా అయిదుగురిని పార్టీ వైపు మళ్ళించినా లేక పార్టీ పక్షాన ఉంచుకున్నా ప్రతీ నియోజకవర్గంలో ఎనభై వేల ఓట్లుగా మారుతాయని ఆ మీదట ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో మరి కొంత యాడ్ అవుతుందని అధినాయకత్వం చేపట్టే పాదయాత్ర వంటి వాటితో ఇంకా ఆ నంబర్ పెరుగుతుందని మొత్తానికి నికరంగా ఒక లక్ష దాకా ఓట్లను ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉంచుకోగలిగితే ఎన్నికల్లో ఎదురు ఉండదని వైసీపీ పక్కా ప్లాన్ తోనే కమిటీల మీద ఫుల్ ఫోకస్ పెడుతోంది అని అంటున్నారు.

**జగన్ విజన్ ఇదే :**

తాజాగా విజయనగరంలో జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సీనియర్ నేత కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ జగన్ విజన్ ని ప్రతీ వారూ తెలుసుకోవాలని అన్నారు. పార్టీకి లాభం కలగాలని పార్టీ గెలవాలని ఆయన కమిటీలను ఏర్పాటు చేయమని గట్టిగా కోరుతున్నారని అన్నారు. జగన్ మాట వింటే పార్టీకి తిరుగు ఉండదని స్వామి చెప్పడం విశేషం. ప్రతీ నియోజకవర్గంలో జగనన్న సైన్యం పెద్ద ఎత్తున తయారు చేయమని అధినేత కోరుతున్నారని ఆయన అన్నారు. అంతా కష్టపడి కమిటీలను వేయాలని ఇక బూత్ లెవెల్ దాకా పార్టీని తీసుకుని వెళ్తే కనుక కచ్చితంగా మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు.

**క్యాడరే లీడర్ :**

మరో వైపు భీమిలీలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వైసీపీ ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ కమిటీలు అన్నీ పూర్తి అయిన తరువాత క్యాడర్ ని తప్పకుండా గుర్తుంచుకుంటామని చెప్పారు. అంతే కాకుండా వారికే అన్ని విధాలుగా పెద్ద పీట వేస్తామని అంటున్నారు. ఇక కార్యకర్తలు అందరికీ ఐడెంటిటీ కార్డుతో పాటు ఇన్సూరెన్స్ కూడా చేయిస్తామని ఆయన చెప్పారు. అధినాయకత్వం క్యాడర్ కే అగ్ర తాంబూలం అని చెబుతోందని అందువల్ల పార్టీ అధికారంలోకి వస్తే క్యాడరే లీడర్ అని వైసీపీ నేతలు చెబుతున్నారు.

# అమెరికాలో మంచు తుపాను విలయతాండవం...

- మొదటి పేజి తరువాయి

దాదాపు 20 కోట్ల మందికి పైగా ప్రజలు శీతల వాతావరణం, మంచు హెచ్చరికల నీడలో జీవిస్తున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాషింగ్టన్ డీసీతో పాటు అలబామా, జార్జియా, కెంటకీ, న్యూయార్క్, టెక్సాస్ సహా 16కు పైగా రాష్ట్రాలు ఇప్పటికే 'స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ'ని ప్రకటించాయి.

ఆర్కిటిక్ ప్రాంతం నుంచి పోలార్ వోర్టెక్స్ కారణంగా దూసుకొస్తున్న అతి శీతల గాలులు, శక్తివంతమైన తుపాను వ్యవస్థతో కలవడంతో ఈ విపత్కర పరిస్థితి ఏర్పడింది. దీని ఫలితంగా దేశంలోని తూర్పు భాగమంతా భారీ హిమపాతం, గడ్డకట్టే వర్షం (ఫ్రీజింగ్ రెయిన్), స్లీట్ (మంచుతో కూడిన వర్షం)తో అల్లకల్లోలంగా మారింది. ముఖ్యంగా సదరన్ ప్లెయిన్స్, లోయర్ మిసిసిపీ వ్యాలీ, టెన్నెస్సీ వ్యాలీ, ఆగ్నేయ రాష్ట్రాల్లో కొన్నిచోట్ల "విపత్తు స్థాయి"లో మంచు పేరుకుపోయే ప్రమాదం ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం (ఎన్‌డబ్ల్యూఎస్) హెచ్చరించింది. "ఇది చాలా తీవ్రమైన తుపాను" అని యూఎస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ వాతావరణ శాస్త్రవేత్త జాకబ్ ఆషర్‌మాన్ అభివర్ణించారు. ఈ మంచు తుపాను కారణంగా దేశవ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. విమాన ప్రయాణాలపై తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ అవేర్ డేటా ప్రకారం, ఈ వారాంతంలో (శని, ఆదివారాలు) ఇప్పటివరకు 8,000కు పైగా విమానాలను రద్దు చేశారు. డెల్టా, అమెరికన్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి ప్రధాన సంస్థలు ప్రయాణ హెచ్చరికలు జారీ చేసి, టికెట్ మార్పు రుసుములను రద్దు చేశాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ కూడా టెక్సాస్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోవచ్చని హెచ్చరించింది. మంచు ప్రభావం కేవలం ప్రయాణాలకే పరిమితం కాలేదు. గడ్డకట్టే వర్షం కారణంగా విద్యుత్ తీగలపై అంగుళం మందం వరకు మంచు పేరుకుపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల విద్యుత్ లైన్లు తెగిపోయి, చెట్లు కూలిపోయి సుదీర్ఘకాలం పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్సాస్‌లో ఇప్పటికే దాదాపు 20,000 మంది, ఓక్లహోమా, ఆర్కాన్సాస్‌లలో వేలాది మంది విద్యుత్ లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. 2021 నాటి విద్యుత్ సంక్షోభం నుంచి పాఠాలు నేర్చుకున్నామని, ఈసారి విద్యుత్ గ్రిడ్‌ను సిద్ధంగా ఉంచామని టెక్సాస్ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఫీమా) దాదాపు 30 సహాయక బృందాలను సిద్ధంగా ఉంచింది. ఆహారం, దుప్పట్లు, జనరేటర్లను కీలక ప్రాంతాలకు తరలించింది. పలు రాష్ట్రాల్లో నేషనల్ గార్డ్ దళాలను మోహరించారు. వాషింగ్టన్ డీసీ మేయర్ మురియల్ బౌజర్ మాట్లాడుతూ, "మేము అధికారికంగా స్నో ఎమర్జెన్సీ, స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించాం" అని తెలిపారు. చికాగోలో పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, లూసియానాలో కార్నివాల్ పరేడ్‌లు, నాష్‌విల్లేలో పలు కార్యక్రమాలు రద్దయ్యాయి.

ఈ తుపాను సోమవారం వరకు కొనసాగి, న్యూయార్క్, బోస్టన్ వంటి ప్రధాన నగరాలపై ప్రభావం చూపనుంది. తుపాను తగ్గుముఖం పట్టినా, ఆ తర్వాత కూడా అత్యంత శీతల గాలులు, ప్రమాదకరమైన వాతావరణం కొనసాగుతుందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# సినీ గ్లామర్ తో రాజకీయాల్లో విజయం సాధించడం సాధ్యం కాదు

- మొదటి పేజి తరువాయి

ఎన్నికలకు వెళ్లడం వల్లే ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధ్యమైందని ఆయన గుర్తుచేశారు.

ఇక జాతీయ రాజకీయాల విషయానికి వస్తే, ప్రస్తుతం దేశంలో సినీ స్టార్లను మించిన స్టార్ ప్రధాని నరేంద్ర మోదీ అని శ్రీనివాస్ వర్మ వ్యాఖ్యానించారు. మోదీ నాయకత్వంలోనే బీజేపీ దేశవ్యాప్తంగా బలపడుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కూడా బీజేపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ పొత్తుల విషయంలో అగ్రనాయకత్వమే చర్చించి తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు విశాఖ స్టీల్ ప్లాంట్ అంశంపై కూడా ఆయన స్పందించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం సమీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. ఆర్థిక భారం తగ్గించే క్రమంలోనే సీఐఎస్ఎఫ్ బలగాల ఉపసంహరణ జరిగిందని వివరణ ఇచ్చారు. ఫిబ్రవరి 4న ఉక్కు శాఖ కార్యదర్శి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులపై సమీక్ష నిర్వహించనున్నారని వెల్లడించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశారు.

# భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

- మొదటి పేజి తరువాయి

మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు. రోజ్‌గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని

ఆయన వెల్లడించారు. యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, దీని ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

# 40 ఏళ్లుగా గర్భం మోసిన మహిళ.. 82 ఏళ్ల వయసులో నొప్పులు.. కట్ చేస్తే!



మాతృత్వం అనేది పెళ్లి అయిన ప్రతి ఒక్క మహిళ కల. ఏడు నెలలు లేదా తొమ్మిది నెలలు మోసి పండంటి బిడ్డకు జన్మనిస్తుంది తల్లి. ఇక ఆ బిడ్డను అల్లారు ముద్దుగా అపురూపంగా చూసుకుంటూ జీవితం ధన్యం చేసుకుంటూ ఉంటుంది. అయితే ఇక్కడ ఒక మహిళ ఏడు కాదు తొమ్మిది కాదు ఏకంగా 40 ఏళ్ల పాటు గర్భవతిగా ఉండి.. చివరికి 82 సంవత్సరాల వయసులో నొప్పులు రావడంతో హాస్పిటల్ కి వెళ్ళింది. పరీక్షించిన వైద్యులు అసలు విషయం తెలుసుకొని ఆశ్చర్యపోయారు. మరి 40 ఏళ్ల పాటు ఆ తల్లి తన గర్భంలో బిడ్డను మోసి.. 82 సంవత్సరాల వృద్ధాప్యంలో నొప్పులు రావడం ఏంటి? ఇది నిజంగా నిజమేనా? కనీసం ఈ విషయం ఆమెకు కూడా తెలియలేదా? అని కొంతమంది ఆశ్చర్యపోతున్నారు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం. సాధారణంగా కొన్ని కొన్ని సంఘటనలు నమ్మశక్యం కానీ నిజాలుగా మారుతున్న వేళ. ప్రతి ఒక్కరు ఆశ్చర్యంతో నోరెళ్ళబడుతున్నారు. అదెలా సాధ్యమనే ఆలోచనలో పడిపోతున్నారు. అలాంటి ఒక సంఘటనకు సంబంధించిన వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రస్తుతం ఒక మహిళ వయసు 82 సంవత్సరాలు. ఒక్కసారిగా భరించలేని కడుపునొప్పి రావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆమెను హాస్పిటల్ కి తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు లోపల కణితి ఉంటుందని భావించారు. కానీ స్కానింగ్ తర్వాత అసలు విషయం తెలిసి ఆశ్చర్యపోయారు. కారణం ఆమె శరీరంలో 40 సంవత్సరాలకు పైగా ఒక కాల్సిఫైడ్ గర్భస్థ శిశువు ఉంది. అంటే 40 సంవత్సరాలుగా ఆమె గర్భవతి అన్నమాట. ఈ అరుదైన పరిస్థితిని వైద్య పరిభాషలో లిథోపెడియన్ లేదా స్టోన్ బేబీ అని పిలుస్తారు. అంటే గత 40 ఏళ్ల క్రితం ఆ మహిళకు ఎక్టోపిక్ గర్భం ఏర్పడిందట . అంటే గర్భస్థ శిశువు గర్భం లోపల కాకుండా గర్భం బయట అభివృద్ధి చెందడం.. దీని కారణంగానే ఆ మహిళకు పురిటి నొప్పులు అందరి లాగే రావడం , బిడ్డను కనడం వంటి పరిస్థితి ఎదురు కాలేదు.

పైగా ఈ సంక్రమణను నిరోధించడానికి అనుగుణంగా ఆమె శరీరం గర్భస్త శిశువును క్యాల్షియంతో ఆవరించి ఒక రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసిందట. ఫలితంగా శిశువు గర్భాశయం వెలుపలి భాగంలో ఒక మమ్మీ సైడ్ రూపంగా మారి నిశ్శబ్దంగా ఉండిపోయింది. అందుకే ఎటువంటి గర్భస్థ లక్షణాలను కూడా కనబరచలేకపోయింది. నిజానికి ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా మాత్రమే జరుగుతాయట. వైద్య చరిత్రలో ఇప్పటివరకు కేవలం 300 కేసులు మాత్రమే గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. ఇకపోతే ఈ విషయం ఎక్కడ? ఎప్పుడు? ఎవరిలో జరిగింది అనే పూర్తి వివరాలు మాత్రం లేవు. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఈ వార్త వైరల్ అవ్వడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఏది ఏమైనా ఇలాంటి సంఘటనలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

## బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉంది

- మొదటి పేజి తరువాయి

ఆయన మాట్లాడుతూ... ఆడపిల్లలను కేవలం కాపాడుకోవడమే కాదు, వారిని ఉన్నత విద్యావంతులుగా, ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులు, సమాజం అందరిపైనా ఉందన్నారు.

బాలికల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు వంటి వాటికి గురికాకుండా కాపాడటం అత్యంత కీలకమని చెప్పారు. బాలికల హక్కుల పరిరక్షణలో తల్లిదండ్రులు మాత్రమే కాదు... అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కూడా భాగస్వాములేనని మంత్రి గుర్తు చేశారు. బాలికల భద్రత విషయంలో నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని హెచ్చరించారు.

## భారత్ పై తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..!

- మొదటి పేజి తరువాయి

రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నందుకు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై 25 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రతీకార సుంకాలు 25 శాతం కలిపి మొత్తంగా మన దేశంపై 50 శాతం సుంకాలు విధించారు. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తుసేవలపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం సుంకాలు వసూలు చేస్తోంది. అయితే, ఇటీవల రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించింది. దీంతో అమెరికా సుంకాలు సగానికి తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విషయాన్ని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

## విదేశాల్లో భారత్ 'వాంటెడ్'.. రెండేళ్లలో 70 మంది గుర్తింపు

- మొదటి పేజి తరువాయి

ముమ్మరంగా కొనసాగుతుందని వెల్లడించింది. అదే సమయంలో ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. పరారీలో ఉన్న వారిని విదేశాల్లో ఇంత పెద్ద మొత్తంలో గుర్తించడం గత దశాబ్ద కాలంలో ఇదే మొదటిసారి అని తెలిపింది.

వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గత సంవత్సరం విదేశాల నుంచి తిరిగి వచ్చారని భారత ప్రభుత్వం వెల్లడించింది. సీబీఐ కేసులకు సంబంధించి ఏడాది వ్యవధిలో 74 రొగేటరీ లెటర్స్ పంపించినట్లు తెలిపింది. దర్యాప్తునకు సహకరించాలని విదేశీ న్యాయస్థానాలకు రాసే లేఖను రొగేటరీ లెటర్స్ అంటారు. ఈ లేఖల్లో 54 సీబీఐ, మరో 20 రాష్ట్ర దర్యాప్తు బృందాలు రాసినట్లు పేర్కొంది.

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ... ఇద్దరు మావోలు అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

ఇన్ స్ట్రక్టర్ మీసాల సాల్మన్ అలియాస్ సంతోశ్ నాగరాజు, డీవీసీఎం అయిన ఆయన భార్యను నాగర్ కర్నూలు పోలీసులు అరెస్ట్ చేశారు. అచ్చంపేటకు వచ్చిన వీరు... మావోయిస్టు ఫ్రంట్ సంస్థల నేతల సాయంతో మావోయిస్టు కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు మహబూబ్ నగర్, నల్లమల ప్రాంతాల్లో మావోయిస్టులకు సహకరిస్తూ, వారికి ఆశ్రయం కల్పిస్తున్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో సివిల్ లిబర్టీస్ కమిటీ జాయింట్ సెక్రటరీ జక్క బాలయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ కో-కన్వీనర్ ఎడ్ల అంబయ్య, మంశెట్టి యాదయ్య ఉన్నారు. ఎర్టిగా కారులో మన్ననూరు నుంచి అచ్చంపేటకు వెళుతున్న సమయంలో వీరిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

## కూటమి పక్కన పెట్టింది...వైసీపీ షాక్ ఇచ్చేసింది

వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామ వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. అంతే కాదు ఏకంగా రెండు లక్షల డెబ్బై వేల మంది దాకా వాలంటీర్లను తీసుకుంది. వీరికి గౌరవ వేతనంగా అయిదు వేల రూపాయలను ఇచ్చింది. వీరిని ప్రతీ యాభై కుటుంబాలకు బాధ్యులుగా చేసింది. ఆ విధంగా వీరు తమకు రాజకీయంగా ఉపయోగపడతారు అని భావించింది. కానీ విషయం చూస్తే మొత్తానికి మొత్తం బూమరాంగ్ అయింది.

**రెండింటికీ చెడి :**

వాలంటీర్లను తీసుకుని వచ్చి వైసీపీ పార్టీ నాయకులను క్యాడర్ ని పూర్తిగా పక్కన పెట్టేసింది. అన్నీ వారే చూస్తారు అని ధీమా పడింది. తీరా ఎన్నికల సమయంలో ఈసీ తీసుకున్న నిర్ణయంతో వాలంటీర్లు అంతా సైడ్ అయిపోయారు. మరో వైపు కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారు వైసీపీని వదిలేసి ఆ వైపుగా పనిచేసారు. కూటమి అధికారంలోకి వస్తే పది వేల రూపాయల గౌరవ వేతనం ఇస్తామని ఇచ్చిన హామీతో వైసీపీని వారే ఓడించేశారు. ఇలా వైసీపీ వ్యూహాలు రెండిందాలుగా చెడిపోయి ఎన్నడూ లేని విధంగా భారీ పరాజయాన్ని మూటకట్టుకుంది.

**కొన్నాళ్ళు ఆందోళన :**

వాలంటీర్లు అయితే కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తల్లో కొన్నాళ్ళ పాటు ఆందోళనలు నిర్వహించారు. తమకు పది వేల రూపాయల వేతనం ఇస్తామని చెప్పారని తమను విధులలోకి తిరిగి తీసుకోవాలని వారు కోరారు. అయితే వారి సేవలను 2023 ఆగస్టు నుంచే వైసీపీ ప్రభుత్వం రెన్యూవల్ చేయలేదని టెక్నికల్ సాకులు చూపించి కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేసింది. అదే సమయంలో నెలవారీగా అందించే సామాజిక పెన్షన్లను కూడా సచివాలయ ఉద్యోగుల చేత అందిస్తోంది. ఈ క్రమంలో వాలంటీర్ల సేవలు అందడం లేదని ఎవరూ అనుకోవడం లేదు, క్రమంగా వారి గురించి కూడా అంతా మరచిపోయారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ఈనెల 27 నుండి ఫిబ్రవరి 7వరకు చించినాడ బ్రిడ్జిపై బస్సుల రాక పోకలు పునరుద్ధరణ




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 24:** సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో దక్షిణ కాశీగా పేరుగాంచిన అంతర్వేది శ్రీ లక్ష్మీనర సింహస్వామి దివ్య కళ్యాణ మహోత్సవాలు సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఈనెల 27 నుండి ఫిబ్రవరి రెండో తేదీ వరకు చించినాడ బ్రిడ్జిపై బస్సుల రాక పోకలు పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ రహదారులు భవనాల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నందు ఆర్టీసి రహదారులు భవనాల శాఖ, పోలీసు ఉన్నతాధికారులతో అధికారులతో సమావేశం నిర్వహించి అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవ భక్తుల రాక పోకల అంశంపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనర సింహస్వామి వారి కల్యాణోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు వచ్చే అవకాశం ఉన్నశీదున వారి సౌకర్యార్థం మరమ్మత్తులలో ఉన్న చించినాడ బ్రిడ్జిపై ఐదు రోజులపాటు తాత్కాలికంగా బస్సులు రాకపోక లకు సుమారు 16 టన్నుల బరువుతో అనుమతించాలని ఆదేశించారు. గోదావరి నదిపై భద్రత దృష్ట్యా పంట్లు పై ప్రయా ణాలను నిరోధించాలన్నారు. చించినాడ వంతెన పై మార్కింగ్ ఇస్తూ ఆ మార్కింగ్ లోనే బస్సులు రాకపోకలు సాగించేలా మానిటరింగ్ వ్యవస్థను పోలీసులు ఆర్టీసీ వారి సమన్వయంతో అమలుచేయాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రాకపోకలను నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎడిషనల్ ఎస్పీ ప్రసాద్, జిల్లా రవాణా అధికారి డి శ్రీనివాసరావు ఆర్టీసీ డిపో మేనేజర్లు ఎం శ్రీనివాసరావు ఎం భాస్కర రావు వైవివిఎస్ కుమార్ జేమ్స్ డిఎస్పి మురళీమో హన్, జాతీయ రహదారు లు సహా ఇంజనీర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

## జిల్లా ఇంచార్జి కలెక్టర్ అపూర్వ భరత్




**కాకినాడ రూరల్, పెన్ పవర్,జనవరి 24:** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛ కాకినాడ సాధనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కాకినాడ రూరల్ మండలం ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్లాస్టిక్, ఈ-వేస్ట్, ఇనుము వంటి వ్యర్థాలకు బదులుగా నిత్యవసర సరుకులు అందించే 'స్వచ్ఛ రథం'ను ఆయన కాకినాడ రూరల్ ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, జెడ్పీ సీఈవో లక్ష్మణరావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం పక్కన నివసిస్తున్న ఎం. రామకృష్ణ దంపతులు స్వచ్ఛ రథానికి ఇనుము తదితర వ్యర్థాలను అందించగా, వాటికి బదులుగా రూ.34 విలువైన సబ్బులు, టీ పొడి ప్యాకెట్లు జిల్లా ఇంచార్జి కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అపూర్వ భరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "జీరో గ్యాప్ శానిటేషన్ ఆంధ్ర" నినాదంతో జనవరి నెల స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా అంతటా నిర్వహిస్తు న్నామని తెలిపారు. మన చుట్టుపక్కల పరిసరాలు వ్యక్తిగత ఆరోగ్యం, జీవన విధానంపై ఎంతో ప్రభావం చూపుతాయని,అందుకే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. ఎప్పటికప్పుడు తమ పరిధిలోని ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా స్వచ్ఛ కాకినాడ జిల్లాగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. జెడ్పీ సీఈవో లక్ష్మణరావు మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నేడు కాకినాడ జిల్లాలో 8 స్వచ్ఛ రథాలను,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 24 స్వచ్ఛ రథాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ స్వచ్ఛ రథాలు నెల రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాలను పర్యటించేలా ప్రత్యేక షెడ్యూల్ రూపొందించినట్లు చెప్పారు. వీటిలో 17 రకాల నిత్యవసర సరుకులు అందుబాటులో ఉంచామని, ప్రజలు తమ వద్ద ఉన్న నిరుపయోగ ఈ-వేస్ట్, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలకు బదులుగా ఈ సరుకులు పొందవచ్చని వివరించారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ మండలం ఎంపీడీవో పి. సతీష్, డిప్యూటీ ఎంపీడీవో ఎం. శ్రీరామ్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎండీ అబ్దుల్ మతిన్, డీఈ డీ. శ్రీనివాసరావు, అంగన్వాడీ టీచర్ కె. విజయలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.



# కాకినాడ కలెక్టరేట్‌లో స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ

**కాకినాడ, పెన్ పవర్, జనవరి 24:** కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) జె. వెంకటరావు, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ. వెంకటలక్ష్మి, కలెక్టరేట్ ఏవో ఎస్. రామ్మోహన్ రావు,వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు,కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్వో జె. వెంకటరావు మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందని, కొన్ని కారణాల వల్ల ఈ నెల నాలుగో శనివారం నిర్వహించామని తెలిపారు. ఈ నెలలో "జీరో గ్యాప్ సానిటేషన్ ఆంధ్ర" అనే థీమ్‌తో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యా లయ ప్రాంగణం కూడా శుభ్రంగా ఉండేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డీఆర్వో అందరితో స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం చేశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) కార్యాలయం వద్ద అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డీఆర్వో వెంకటరావు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు నాంది పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో మానవహారం నిర్వహించారు.



# భక్తిశ్రద్ధలే నిధులుగా మందేశ్వర స్వామి దేవస్థానానికి భారీ ఆదాయం





**కొత్తపేట, పెన్ పవర్, జనవరి24;** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వెలసిన శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం స్వామివారికి తైలాభిషేకాలు,ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడాయి. ఈ సందర్భంగా వివిధ సేవలు, పూజల ద్వారా ఆలయానికి గణనీయమైన ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

ఆదాయ వివరాలు ఇలా ఉన్నాయి.

ముఖ మండప సేవ ద్వారా 26 మందికి గాను రూ.18,200,ఏకాదశ రుద్ర తైలాభిషేకం ద్వారా రూ.52,500,మహాన్యాస పూర్వక తైలాభిషేకం ద్వారా రూ.40,250,స్వయం హోమం ద్వారా రూ.2,400, తైలం సమర్పించి దర్శనం ద్వారా రూ.12,240, తిలదానం ద్వారా రూ.350, కేశఖండన సేవ ద్వారా రూ.120 సమకూరాయి. ఈ సేవల ద్వారా మొత్తం రూ.1,26,060 ఆదాయం లభించింది.

అలాగే అన్నప్రసాద విరాళాల రూపంలో రూ.43,215, పరోక్ష పూజల ద్వారా రూ.93,000 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాల నుంచి కలిపి ఆలయానికి మొత్తం రూ.2,62,275 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ విషయాలను దేవస్థాన సహాయ కమిషనరు,కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు అధికారికంగా వెల్లడించారు. ఆలయ అభివృద్ధికి భక్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ తోట మాట్లల్లో వాస్తవం లేదు.




**మండపేట. పెన్ పవర్. జనవరి 24 :**
ఇకనైనా డప్పులు కొట్టడం ఆపండి
ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు.

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చెప్పేవన్నీ అవాస్తవాలు అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. ఎప్పటిలాగే తమ పబ్బం గడుపుకోవటానికి కూటమి ప్రభుత్వం పై బురద జల్లుతూ ఒక వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్నారు. దీనిపై రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మండిపడ్డారు. ఎమ్మెల్సీ చెప్పిన దాంట్లో వాస్తవం లేదని అన్నారు. ఆ వాఖ్యలను పూర్తిగా ఖండింస్తున్నట్లు ఎమ్మెల్యే వేగుళ్ళ తెలిపారు. మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతాంగం 70 రూపాయలు అదనంగా పెట్టి ఎరువులు కొంటున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్న వాఖ్యలపై ఏ గ్రామంలో ఏ రైతు ఏ షాపు దగ్గర 70 రూపాయలు అదనంగా పెట్టి ఎరువులు కొన్నారో ఋజువు చెయ్యాలని ఛాలెంజ్ చేశారు. ఆ విధంగా ఋజువు చేస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుని, ఆ షాపుని సీజ్ చేయిస్తాం అన్నారు. అంతేకాని మీ అధిష్టానం నుండి వచ్చిన స్క్రిప్ట్ ను చెప్పి ప్రజలను నమ్మించాలనుకుంటే ఇక్కడ నమ్మే వారు ఎవ్వరు లేరన్నారు. మండపేట నియోజకవర్గంలో 52,865 ఎకరాల్లో సెకండ్ క్రాప్ కి వరి పండిస్తున్నారన్నారు. ఎకరానికి మూడు బస్తాల చొప్పున సుమారు 1,59,422 బస్తాలు యూరియా రైతాంగానికి అవసరం ఉండగా ఈరోజు వరకు రైతు సేవా కేంద్రాలు, సొసైటీలు, ఎరువుల షాపుల ద్వారా 92,355 బస్తాలు రైతులకు అందించినట్లు చెప్పారు. రైతులకు ఎప్పటికప్పుడు ఇన్ టైమ్ లో ఎరువులు సప్లై చేస్తున్నామని పేర్కొన్నారు. ఒకవేళ ఎక్కడైనా యూరియా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావలని ఎమ్మెల్యే వేగుళ్ళ తెలిపారు.

వైసీపీ ప్రభుత్వంలో 1600 కోట్ల రూపాయలను రైతాంగానికి యగనామం పెడితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ 1600 కోట్లు రైతులకు ఇచ్చిన విషయం తోట అప్పుడే మర్చిపోయారా అంటూ చురకలు అంటించారు. కూటమి ప్రభుత్వం ఈ ఫస్ట్ క్రాప్ లో గతంలో ఎప్పుడూ లేని విధంగా కొత్తరికార్డు సృష్టించిందని పేర్కొన్నారు. 13,20,000 బస్తాలను మద్దతు ధరకి పౌర సరఫరాలశాఖ ద్వారా తీసుకుని 24 గంటలు లోపే 231 కోట్లు ను నూటికి నూరు శాతం రైతాంగానికి చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతాంగానికి అన్ని విధాలా ఆదుకుంటూ ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇచ్చామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సగటున 10 లక్షల బస్తాలకు దాటి ధాన్యం సేకరణ చెయ్యలేకపోయారని దుయ్యబట్టారు. లేని విషయాన్ని ఉన్నదని నమ్మించడంలో వారి నాయకుడు, తోట కంటే సిద్దహస్తులు ఎవరు ఉంటారని ఎమ్మెల్యే వేగుళ్ళ వ్యంగ్యంగా అన్నారు. తప్పుడు లెక్కలతో పట్టాదార్ పాస్ పుస్తకాలను సర్వనాశం చేసి, రైతులను అన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టింది ఎవరో అందరికీ తెలుసునన్నారు. నవంబర్ నెలలో జరిగిన డిఆర్ సి సమావేశంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో పాస్ పుస్తకాలలో జరిగిన తప్పులను సరిచేయాలని ప్రతిపక్షంగా మీరెత్తుకున్నారా? తాము ఎత్తుకున్నామా? అని ప్రశ్నించారు. తాను ఆవేళ ఇన్ ఛార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు ని దీనిపై ప్రశ్నిస్తుంటే ఎమ్మెల్సీ తోట ముసిముసి నవ్వులు నవ్వుకుంటా కూర్చున్నారే తప్ప ఆ తప్పులను సరిదిద్దమని డిమాండ్ చెయ్యలేదన్నారు. ఆ డిమాండ్ కూడా తామే చేశామని ఎమ్మెల్యే అన్నారు. మొన్న రాయవరం లో జరిగిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన దాన్ని ఒక్కసారి చెవులతో వినాలన్నారు. రైతాంగానికి ఈ డ్రాఫ్ట్ నమూనా పట్టాదార్ పాస్ బుక్ చూపించి సంబంధిత రైతు ఓకే అన్నాకే ఒరిజినల్ పట్టాదార్ పాస్ బుక్ తయారు చేసి రైతాంగానికి ఇస్తామని రాయవరం సభలోనే చెప్పిన విషయం వినబడలేదా అన్నారు. మీరు చేసిన తప్పులు సరిచేసుకుంటూ ముందుకు వెల్తుంటే చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తారా అంటూ మండిపడ్డారు. రాయవరం ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావటంతో వైసీపీ నాయకులకు బుర్ర పనిచేయటం లేదని అందువలనే ఆరోజు సమావేశం నకు రైంతాగమే రాలేదని తోట అంటున్నారని అన్నారు. మీలా మీ నాయకుడి సమావేశాలకు జనాలను కిరాయిలకు, బలవంతంగా తీసుకువచ్చే సంస్కృతి తెలుగుదేశంపార్టీలో లేదని తెలియజేశారు. మీరు చేపట్టిన రీ సర్వే ను ఆనాడు రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ లోనే ఎందుకు చేశారు? మిగిలిన కొత్తపేట రెవెన్యూ డివిజన్, అమలాపురం రెవెన్యూ డివిజన్ లో ఉన్న ఐదు నియోజకవర్గాల్లో ఎందుకు రీ-సర్వే చేయలేదో మండపేట నియోజకవర్గ రైతాంగానికి సమాధానం చెప్పే దమ్ము తోట త్రిమూర్తులకు ఉందా అని ప్రశ్నించారు. తోట పదేపదే మాట్లాడుతూ మీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటున్నారని, మరి మీకు ముఖ్యమంత్రి ఎవరో ప్రెస్ కి సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఇరిగేషన్ కి సంబంధించి వైసీపీ హయాంలో ఎక్కడైనా ఒక పంట కాలవలో కాని, మురిగి కాలువలో కాని పూడికతీత పనులు చేసిన సంధర్భాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని కాలువలలో పూడిక తీత పనులు చేశామన్నారు. ఇది రైతుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న అభిమానం, ఆపేక్ష అని ఎమ్మెల్యే తెలియజేశారు.

ఇప్పటికైన మీరు మీ నాయకుడి కోసం డబ్బాలు కొట్టడం మానేసి నిజంగా ఏమైనా ప్రజలకు సంబంధించిన సమస్యలు ఉంటే అవి ఎత్తి చూపితే దాన్ని కూడా సరిచేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే వేగుళ్ళ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ కాశిన కాశీ విశ్వనాధం, వాదా ప్రసాదరావు లు పాల్గొన్నారు.

# ద్వారపూడి లో జాతీయ బాలికా దినోత్సవం.



**మండపేట. పెన్ పవర్.జనవరి 24 :** జాతీయ బాలికదినోత్సవం పురస్కరించుకొని ద్వారపూడి గ్రామంలో జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. విద్యాకమిటి చైర్మన్ కంకటాల మురళి కృష్ణ అధ్యక్షత వహించారు. పీహెచ్ సీ డాక్టర్ పి జగదీప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, మంచి ఆహారం గురించి వివరించారు. ఏ సమస్య వచ్చిన తల్లితండ్రులతో చర్చించాలని పేర్కొన్నారు.
స్కూలు హెచ్ ఎం బి. రాజరాజేశ్వరి మాట్లాడుతూ పాఠశాల మధ్యలో మాని వేయడం అరికట్టాలన్నారు. బాలికలను చదివించి, సాధికారత కల్పిస్తే,రేపటి తల్లులు ఆరోగ్యంగా సమాజం బలంగా మారుతుందని తెలియజేసారు. ఐసిడిఎస్
సూపర్వైజర్ సునీత, శ్రీదేవి మాట్లాడుతూ బాలికలపై ఉన్న వివక్షను తగ్గించాలని కోరారు. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు, బాల్య వివాహాలు, బాల కార్మికత్వం నివారించాలని, బాలికల హక్కులు, భద్రతపై అవగాహన పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో పి హెచ్ ఎన్ ఉమాదేవి, ఏం ఎల్ హెచ్ పి లు ఏం శాంతి, బి. కృష్ణవేణి, ఏం వెంకటలక్ష్మి, ఏ ఎన్ ఎంలు అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# జనవరి 27 నుండి ఫిబ్రవరి 2 వరకు చించినాడ బ్రిడ్జిపై రాకపోకల పునరుద్ధరణ



**అల్లవరం/అమలాపురం,జనవరి24:**సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో దక్షిణ కాశీగా పేరుగాంచిన అంతర్వేది శ్రీ లక్ష్మీనర సింహస్వామి దివ్య కళ్యాణ మహోత్సవాలు సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఈనెల 27 నుండి ఫిబ్రవరి రెండో తేదీ వరకు చించినాడ బ్రిడ్జిపై బస్సుల రాక పోకలు పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ రహదారులు భవనాల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్నందు ఆర్టిసి రహదారులు భవనాల శాఖ, పోలీసు ఉన్నతాధికారులతో అధికారులతో సమావేశం నిర్వహించి అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవ భక్తుల రాక పోకల అంశంపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారి సౌకర్యార్థం మరమ్మత్తులలో ఉన్న చించినాడ బ్రిడ్జిపై 5 రోజులపాటు తాత్కాలికంగా బస్సులు రాకపోకలకు సుమారు 16 టన్నుల బరువుతో అనుమతించాలని ఆదేశించారు.గోదావరి నదిపై భద్రత దృష్ట్యా పంట్లు పై ప్రయాణాలను నిరోధించాలన్నారు. చించినాడ వంతెన పై మార్కింగ్ ఇస్తూ, ఆ మార్కింగ్ లోనే బస్సులు రాకపోకలు సాగించేలా మానిటరింగ్ వ్యవస్థను పోలీసులు ఆర్టీసీ వారి సమన్వయంతో అమలు చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రాకపోకలను నిర్వహించాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎడిషనల్ ఎస్పీ ప్రసాద్, జిల్లా రవాణా అధికారి డి. శ్రీనివాసరావు ,ఆర్టీసీ డిపో మేనేజర్లు ఎం.శ్రీనివాసరావు ఎం.భాస్కర రావు వైవివిఎస్ కుమార్ జేమ్స్ డిఎస్పి మురళీమోహన్, జాతీయ రహదారులు సహ ఇంజనీర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## భీష్మ ఏకాదశికి ముస్తాబైన జనార్ధనస్వామి రథం




**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 24;**నవ జనార్ధన ఆలయాల్లో అత్యంత ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి కళ్యాణ మహోత్సవం, రథోత్సవానికి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. మండలంలోని అత్యంత ప్రఖ్యాతి చెందిన, యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చే రథోత్సవం కావడంతో అందుకు తగినన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. నూతన రంగులతో అందంగా స్వామివారి రథాన్ని తీర్చిదిద్దారు. రథోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆలమూరు ఎంపీడీవో ఏ.రాజు పరిశీలించారు.కళ్యాణ మహోత్సవ,రథోత్సవాలకు ఆహ్వానం పలుకుతూ ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు ప్రముఖులందరికీ కరపత్రికలు ఇప్పటికే అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అంగర భగవానాచార్యులు, ఖండవల్లి ప్రభాకరాచార్యులు, అయినవిల్లి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## వివిధ గ్రామాలలో సీసీ రోడ్లు అభివృద్ధి పనులకు శంకుస్థాపలు చేసిన ఎమ్మెల్యే దాట్ల





**కాట్రేనికోన పెన్ పవర్ జనవరి 24 :**కాట్రేనికోన మండలం పల్లంకుర్రు గ్రామంలో గ్రామ అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే లక్ష్యంతో1.35 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించబడనున్న సీసీ రోడ్లు మరియు విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముమ్మిడివరం నియోజకవర్గ అభివృద్ధిని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి కీలక అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామంలో రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు సులభతర ప్రయాణం అందుబాటులోకి వస్తుంది. విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణంతో గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మరింత దగ్గరగా అందుతాయి. ఈ అభివృద్ధి కార్యక్రమంలో , ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరావు,నడింపల్లి సుబ్బరాజు, సర్పంచ్ చెల్లి సురేష్,కాసిరెడ్డి రాజా,కాశి శ్రీనివాసరావు, బడుగు పుల్లారావు, మొకా బాల ప్రసాద్, పెన్మత్స రాంబాబు రాజు, భూపతిరాజు వర్మ,విత్తనాల బుజ్జి ,కముజు దత్తుడు,ఓగూరీ భాగ్యశ్రీ, వెంట్రు సుదీర్, వంగ దుర్గ బాబు, రవి వర్మ, అల్లూరి సీతారామరాజు, వాసంశెట్టి రాజేశ్వరరావు, గోడి వెంకటరావు,ఇసుకపట్ల వెంకటరమణ, నూకల దుర్గ, బల్ల కుమార్,మెల్లం సువర్ణ జ్యోతి, గెడ్డం చంద్రశేఖర్, వాకపల్లి ఆనంద్,వాకపల్లి అప్పారావు , సాపేవారిపల్లె హై స్కూల్ ఎస్ఎంసి చైర్మన్ కాశి శ్రీనివాస్, ఇసుకుపట్ల సురేష్,,కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
గ్రామాల అభివృద్ధే లక్ష్యంగాడ ప్రజల సౌకర్యమే ధ్యేయంగా పనిచేస్తున్న దాట్ల సుబ్బరాజు కృషిని ప్రజలు కొనియాడారు.ం

## పి.గన్నవరంలో విషాదం: చిన్నారి జాహ్నవి కుటుంబానికి రూ. 1 లక్ష ఆర్థిక సాయం



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 24:** మండలంలోని గంటి పెదపూడి గ్రామంలో చోటుచేసుకున్న ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు బొమ్మ మీద పడటంతో రెండో తరగతి చదువుతున్న జాహ్నవి అనే చిన్నారి దుర్మరణం చెందింది. ఈ హృదయవిదారక ఘటన తెలుసుకున్న పలువురు నేతలు బాధితులకు అండగా నిలిచారు.
కుటుంబాన్ని పరామర్శించిన నేతలు శనివారం జాహ్నవి కుటుంబాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, వాసంశెట్టి సత్యం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షులు గుత్తుల సాయి పరామర్శించారు. వారితో పాటు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గంధం పల్లం రాజు, నామన రాంబాబు తదితరులు చిన్నారి తల్లిదండ్రులను కలిసి ధైర్యం చెప్పారు.
సత్యం ఫౌండేషన్ ఆసరా...
ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం తన ఉదారతను చాటుకున్నారు. సత్యం ఫౌండేషన్ ద్వారా మృతి చెందిన జాహ్నవి కుటుంబానికి రూ. లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో పేద కుటుంబానికి అండగా నిలిచిన సత్యం ఫౌండేషన్ సేవలను గ్రామస్తులు అభినందించారు.

## పలువురికి పరామర్శించిన కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల మోహనరావు





**గండేపల్లి, పెన్ పవర్, జనవరి, 24:**మండల కేంద్రమైన గండేపల్లిలో పలువురిని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ , మండల టిడిపి అధ్యక్షులు కోతుల మోహన్రావు పరామర్శించారు. గండేపల్లి గ్రాము మాజీ సర్పంచ్ లంజపల్లి రామకృష్ణ అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకున్న సందర్భంగా వారిని పరామర్శించి ఆరోగ్య స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మరణించిన రెడ్డి ఉమామహేశ్వరరావు వారి కుటుంబాన్ని పలకరించి ప్రగాఢ సానుభూతి తెలియపరిచారు. వీరి వెంట గండేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లం రెడ్డి రామకృష్ణ, వెంపాటి రాజు, ఆళ్ల సత్తిబాబు, కంటిపూడి సత్తయ్య, ముంగర విష్ణుమూర్తి, లంజపల్లి తాతాజీ, గద్దె దొర తదితరులు పాల్గొన్నారు.

## గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయాలు



**గండేపల్లి, పెన్ పవర్, జనవరి, 24:**మాఘమాసం మొదటి శనివారం రథసప్తమి ముందు రోజు కావడంతో ఆలయాలు గోవింద నామస్మరణలతో మారు మృగాయి. దాన్లో భాగంగా గండేపల్లి మండలం తాళ్లూరు మఠంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటీతింది. తెల్లవారుజాము నుండి దైవ దర్శనార్థం భక్తులు సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు. అలాగే తాళ్లూరు గ్రామంలో మహిళలు విష్ణు పారాయణం ఆలయ వద్ద నిర్వహించారు. వచ్చిన భక్తులకు పారాయణం ఎంతగానో ఆకట్టుకుంది. ఆలయ పూజారి నానాజీ భక్తులకు నామ గోత్రాలతో పూజలు నిర్వహించి ప్రసాదం అందించారు. దాంతో ఆలయ ప్రాంగణమంతా గోవిందా గోవిందా నామస్మరణతో మారు మ్రొగింది.

## కర్పూరి ఠాకూర్ జయంతిని ఘనంగా నిర్వహించిన బీజేపీ ఓబీసీ మోర్చా



**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 24 :**భారతరత్న, జననాయక్ స్వర్గీయ కర్పూరి ఠాకూర్ జయంతిని బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం ఆలమూరు మండలం లో గురువారం ఘనంగా నిర్వహించారు.భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఆదేశాల తో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగలి గోపీ శ్రీనివాస్ సూచనలతో ఈ కార్యక్రమం జరిగింది. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా సత్యప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు మిద్దె పురుషోత్తం ఆధ్వర్యంలో కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ అయినవిల్లి సత్తిబాబు గౌడ్, వెనుకబడిన వర్గాలు, అణగారిన ప్రజల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహానాయకుడు కర్పూరి ఠాకూర్ అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజల పక్షాన నిలబడి పనిచేసిన అరుదైన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.ఆలమూరు మండలం నాయి బ్రాహ్మణుల సంఘం అధ్యక్షులు అయినమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, సరళ జీవనం, నిజాయితీ, సామాజిక న్యాయానికి అచంచల నిబద్ధత కర్పూరి ఠాకూర్ రాజకీయ జీవితానికి ప్రతీకలని తెలిపారు.బీజేపీ నాయకులు జొన్నాడ రాంబాబు మాట్లాడుతూ, 1978లో బీహార్‌లో వెనుకబడిన వర్గాలకు 26 శాతం రిజర్వేషన్ అమలు చేసి లక్షలాది కుటుంబాల జీవితాల్లో వెలుగు నింపారని గుర్తు చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2024లో మరణానంతరం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో కడియం ప్రేమ్ కుమార్, పాలూరి చిట్టి రాజు, రాలి వీర వెంకట సుబ్రహ్మణ్యం, కుందూరు దుర్గాప్రసాద్, అయినవిల్లి సూర్యనారాయణ, కాళ్లపాక మహేష్ తదితరులు పాల్గొని కర్పూరి ఠాకూర్ ఘన నివాళులు అర్పించారు.

## వరుపుల తమ్మయ్యబాబు కుటుంబానికి ముద్రగడ పరామర్శ.




**కిర్లంపూడి,పెన్ పవర్,జనవరి 24:**ఏలేశ్వరం మాజీ ఎంపిపి,జనసేన పార్టీ సీనియర్ నాయకులు, వరుపుల తమ్మయ్యబాబు కుటుంబాన్ని మాజీ మంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం, ఆయన తనయుడు ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శనివారం పరామర్శించారు. వరుపుల తమ్మయ్యబాబు ఇటీవల ఆకస్మిక మృతి చెందారు.దీంతో శనివారం ముద్రగడ పద్మనాభం,ఆయన తనయుడు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు తమ్మయ్యబాబు కుమారుడు వరుపుల సాయి తోపాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేసారు. ఈ సందర్భంగా తమ్మయ్యబాబు చిత్రపటానికి పూలు వేసి ఘనంగానివాళులర్పించారు.ఈ కష్ట సమయంలో తమ్మయ్యబాబు కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, తమ్మయ్య బాబు ఆత్మకు శాంతి చేకూరాలని ముద్రగడ పద్మనాభం, ముద్రగడ గిరిబాబు ఆకాంక్షించారు.

## గ్రామాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి భాధ్యత: ఎమ్మెల్యే దాట్ల




**కాట్రేనికోన పెన్ పవర్ జనవరి 24 :**
కాట్రేనికోన మండలం గెద్దనపల్లి గ్రామంలో నిర్వహించిన "స్వచ్ఛ ఆంధ్రా స్వర్ణ ఆంధ్రా" కార్యక్రమంలో శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు పాల్గొని గ్రామ ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తూ పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, చెత్తను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని ఆయన అన్నారు.కార్యక్రమం లో ఏ ఎం సి చైర్మన్ ఓగూరి భాగ్య శ్రీ, స్థానిక సర్పంచ్ దంతులూరి సీతా రామ కృష్ణం రాజు, నాగిడి నాగేశ్వరరావు, చెల్లి సురేష్ నడింపల్లి సుబ్బరాజు ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు, డిప్యూటీ ఎంపీడీఓ నున్న శంకర నారాయణ, జి ఎస్ డబ్లు ఎస్ అధికారి సూర్యనారాయణ రాజు, పంచాయతీ కార్యదర్శి ఎం టి వి వర్మ, కముజు లక్ష్మి రమణా రావు, విత్తనాల బుజ్జి, ఆకాశం శ్రీనివాస్, వెంట్రు సుధీర్, గోడి అప్పారావు, వి వెంకట రమణ, పంచాయతీ సిబ్బంది కోరుమిల్లి రాంబాబు, కూటమి నాయకులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఘనముగా ముగిసిన ఎఐసిటిఇవాణి ప్రాయోజిత సదస్సు



**గండేపల్లి, పెన్ పవర్, జనవరి, 24:**గండేపల్లి మండలం సూరంపాలెం లోని ఆదిత్య విశ్వవిద్యాలయలో ఎఐసిటిఇ వాణి ప్రాయోజిత సదస్సు "ఎ. ఐ. ఆధారిత శక్తి ఆవిష్కరణలు మరియు వాతావరణానుకూల సాంకేతికతలు అంశం" పై జనవరి 23 నుండి జనవరి 24, 2026 వరకు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యములో విజయవంతముగా నిర్వహించినారు.
ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ సతీష్ కుమార్ పెద్దపెల్లి,రిజిస్ట్రార్,శాతవాహన యూనివర్సిటీ ,కరీంనగర్, ప్రొఫెసర్ శేషగిరి రావు అంబటి,ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ పెట్రోలియం మరియు ఎనర్జీ ,విశాఖపట్నం, డాక్టర్ సి.హెచ్. సంపత్ కుమార్ ,అసిస్టెంట్ ప్రొఫెసర్ ,ఎన్.ఐ.టి వరంగల్, డాక్టర్. టి.కార్తికేయ శర్మ,అసిస్టెంట్ ప్రొఫెసర్ ,ఎన్.ఐ.టి, ఆంధ్ర ప్రదేశ్, పి.ఆర్. భావన,ఎక్స్ చీఫ్ జనరల్ మేనేజర్,ఓ.ఎన్.జి.సి, రాజమండ్రి , శ్రీ. ఎస్. చిరంజీవులు,రిటైర్డ్ చీఫ్ మేనేజర్, ఓ.ఎన్.జి.సి, మంగళూరు, రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరించారు.
ఈ సదస్సులో శక్తి వినియోగం ద్వారా ఆర్థిక అభివృద్ధి మరియు జీవన ప్రమాణాల మెరుగుదల, సాంకేతిక పురోగతి, స్మార్ట్ వ్యూహాలతో కూడిన శక్తి నిల్వల పరికరాల గురించి స్పష్టముగా వివరించారు. ఈ కార్యక్రమములో దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలలు, పరిశోధనా సంస్థలు మరియు పరిశ్రమల నుంచి నిపుణులు హాజరై కీలక అంశాలను తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డాక్టర్.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం బి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ -అకాడెమిక్స్ డాక్టర్ యస్ .రమాశ్రీ , ప్రో వైస్ ఛాన్సలర్ ఇంజనీరింగ్ మరియు సైన్సెస్-డాక్టర్ ఎ. రమేష్, రిజిస్టర్ డాక్టర్. జి.సురేష్, డీన్లు, డాక్టర్ ఏ.శరవణన్, డాక్టర్ పీ .ఎస్ .రంజిత్, విభాగాధిపతి డాక్టర్ ,యస్.డి.వి.వి.యస్.భీమేశ్వర రెడ్డి, కోఆర్డినేటర్స్ డాక్టర్ డా.ఎలుమలై పి.వి మరియు సహ-కోఆర్డినేటర్ డా.ఉజ్వల్ కిరణ్ రొక్కాల మరియు అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొని సదస్సుని విజయవంతముగా ముగించారు .

# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ముదునూరి మురళీకృష్ణంరాజు.






**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జనవరి 24:**పత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో గూడుపిది రామాలయం వద్ద శ్రీ గౌరీ శంకరుల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రతిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ శ్రీ గౌరీ శంకరుల ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ఆ భగవంతున్ని ప్రార్థించడమే కాకుండా, ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఈకార్యక్రమంలో ధర్మవరం గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల,అబ్బాయి,మాజీ వైస్ సర్పంచ్ జువ్వల సత్యనారాయణ,జువ్వల దొరబాబు,పోకనాటి వెంకటేశ్వరరావు,బలిజి వీర్రాజు,దాడి పుత్రయ్య,ఉర్లంకల చంద్రరావు, కంటపరెడ్డి వీర్రాజు,జనపరెడ్డి ముసలయ్య,చెన్నాడ రాజు,దండ చిన్నారావు,మట్ట లక్ష్మణరావు,మంతెన రమణ,పిట్టి లోవరాజు,గరగ లోవరాజు,ఇనుపకుర్తి వీరబాబు,మట్ట లోవరాజు,జువ్వల రాజు,శ్రీ గౌరీ శంకరుల ఆలయ కమిటీ సభ్యులు,ముఖ్య నాయకులు,తదితరులు పాల్గొన్నారు

02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

## విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



**పెద్దాపురం, పెన్ పవర్, జనవరి 23 :** విద్యార్థులు వినయం, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని శ్రీలలితా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్ గారి సతీమణి విద్యుల్లత, భారత్ గ్యాస్ ఏజెన్సీస్ డిస్ట్రిబ్యూటర్, ఏపీ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ స్టేట్ ట్రెజరర్ మండవిల్లి శ్రీనివాస ముత్యాలు, షర్మిల దంపతులు అన్నారు. ప్రకృతి పులకించే వసంత ఋతువుకు స్వాగతం పలుకుతూ చదువుల తల్లి, జ్ఞానప్రదాయని అయిన సరస్వతీ దేవి జన్మదినమైన వసంత పంచమి (శ్రీ పంచమి) సందర్భంగా పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలోని అమరావతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ లలితా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్ గారి సతీమణి విద్యుల్లత, భారత్ గ్యాస్ ఏజెన్సీస్ డిస్ట్రిబ్యూటర్, ఏపీ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ స్టేట్ ట్రెజరర్ మండవిల్లి శ్రీనివాస ముత్యాలు, షర్మిల దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ తొలుత దీప ప్రజ్వలన గావించి ఆ వాగ్దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జి.వి.వి. వీర్రాజు, హెచ్ఎం జి.శ్రీఅన్నపూర్ణ, ఉపాధ్యాయులు టి చంద్రరావు, జి. దివ్య, ఎ. పుష్ప, ఎన్. జ్యోతి, ప్రియాంక, సిహెచ్ జ్యోతి, తులసి తదితరులు పాల్గొన్నారు.

## శృంగార వల్లభ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



**పెద్దాపురం, పెన్ పవర్, జనవరి 24 :** పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొనేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి వారిని ఈరోజు సుమారు 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 2,14,710/-, అన్నదాన విరాళాల ద్వారా రూ. 1,02,847/-, కేశ ఖండన ద్వారా రూ. 5,680/- తులాభారం ద్వారా రూ. 500/- లడ్డు ప్రసాదం ద్వారా రూ. 23,910/-, మొత్తం రూ. 3,47,647/- ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం, సుమారు నాలుగు వేల ఐదు వందల భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ మొయిళ్ళ సంధ్య, ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇరుసుమండ బ్లో అవుట్ భాదితులకు కుటుంబానికి రూ. పదివేలు ఓఎన్జిసి ఎక్స్ గ్రేషియా



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 24:**ఈనెల 5వ తేదీన ఇరుసుమండ గ్రామం లో సంభవించిన బ్లో అవుట్ బాధిత 6300 కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ 10వేలు చొప్పున ఓఎన్జిసి ఎక్స్ గ్రేషియా ప్రకటించిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించి ఓఎన్జిసి ప్రకటించిన ఎక్స్ గ్రేషియా గురించి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఓఎన్జిసి మోరి 5 బోరు బావిని డీప్ ఇండస్ట్రీస్ వారికి లీజుకు ఇవ్వగా వారు పెర్ఫరేషన్ చేస్తుండగా బోరుబావి నుండి ఉదయం 11:30 గంటలకు గ్యాస్ లీక్ కావడం అనంతరం 12:30 గంటలకు బ్లో అవుట్ మంటలు వ్యాపించి సుమారు నాలుగు గ్రామాల ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిందని సురక్షిత ప్రాంతాలకు చేరుకొని మూడు రోజులపాటు పునరావసం పొందారని తెలిపారు. ఇరుసుమండ, గుబ్బల పాలెం లక్కవరం చింతపల్లి గ్రామాలకు చెందిన బ్లో అవుట్ ప్రభావిత గ్రామాలకు చెందిన 6,300 కుటుంబాలు వద్ద ఓఎన్జిసి ప్రతినిధులు బ్యాంక్ అకౌంట్ వివరాలను సేకరించి ఫిబ్రవరి మొదటి వారంలో ఎక్స్ గ్రే షియా వారి వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈనెల తొమ్మిదో తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే చేసి బ్లో అవుట్ సంభవించిన తీరుతెన్నులను ప్రజా ప్రతినిధులను జిల్లా యంత్రాంగం ఓఎన్జిసి ప్రతినిధులను అడిగి తెలుసుకుని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను ప్రజా శ్రేయస్సు కోరి తీసుకోవాలని సూచించి ఉన్నారన్నారు. జరిగిన సంఘటన పట్ల పరిహారాలు అందించాలని ఓఎన్జిసి అధికారులకు సూచించిన మీదట ఈ యొక్క పరిహారాలను అందించడం జరుగుతుందన్నారు రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ ప్రసంగిస్తూ ఐదు లక్షలు వైద్య బీమా అందించాలని లక్కవరం గ్రామంలో ఉన్న 2.57 ఎకరాలు విస్తీర్ణంలో ఓఎన్జిసి బ్రాండ్ పేరిట మల్టీ స్పెషాలిటీ వంద పడకల ఆసుపత్రిని 60 గ్రామాల ప్రజలకు అనువుగా నిర్మించాలన్న అభ్యర్థనకు ఓఎన్జిసి అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. ఈనెల 5వ తేదీన జరిగిన సంఘటన పట్ల ఓఎన్జిసి బ్లో అవుట్ నియంత్రణ బృందం చాకచక్యంగా వ్యవహరించి ఐదు రోజులలో బోరుబావికి క్యాప్ బిగించడంతో ఈ 4 గ్రామాల ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారన్నారు. గ్యాస్ నిక్షేపాలు వెలికి తీస్తున్న బోరు బావులు మరియు, రీ ఓపెన్ పెర్ఫరేషన్ చేసేటప్పుడు ఆ యొక్క వివరాలను సమీపంలోని ప్రాంతాల వారికి ముందుగా తెలియ చేయడంతో పాటుగా ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సేఫ్టీ మెజర్మెంట్స్ తో అప్రమత్తం గా వ్యవహరించాలని అదేవిధంగా ప్రజాప్రతిని ధులకు జిల్లా యంత్రాంగానికి కూడా ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంలో ఎక్స్ గ్రేషియా అందించడం లో కొంచెం జాప్యం జరిగిందని ఆయన అన్నారు. ఓఎన్జిసి రాజమండ్రి సెక్షన్ కార్యనిర్వాహక ఇంజనీర్ శాంతానో దాస్ మాట్లాడుతూ ఓఎన్జీసి చమురు సహజవాయువుల నిక్షేపాలను వెలికి తీసే సందర్భంలో సేఫ్టీ మెజర్మెంట్స్ పాటిస్తుందని ఇకపై ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టిందన్నారు. క్రైసెస్ మేనేజ్మెంట్ బృందం ఎంతో చాకచక్యం గా ఇటువంటి సందర్భాలలో వ్యవహరించి మంటలను అదుపులోనికి తెచ్చిందన్నారు. ఇకపై పబ్లిక్ సెక్టార్ లో కార్యకలాపాలు నిర్వ హణ సందర్భంలో జిల్లా యంత్రాంగం ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సమన్వయంతో డ్రిల్లింగ్ ప్రక్రియలో ఉపద్రవాల సంభవించకుండా రక్షణ జాగ్రత్త చర్యలు కూడా పటిష్టమైన భద్రతా చర్యల నడుమ చమురు సహజవాయువుల వెలికితీత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు మంచి కమిట్మెంట్ ప్రికాషన్స్ తో మానిటరింగ్ వ్యవస్థను చేపడతామని తెలిపారు.

## ఆదిత్య లో విజ్ఞానదాయకంగా ముగిసిన విద్యార్థి నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం




**గండేపల్లి, పెన్ పవర్, జనవరి, 24:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (అటానమస్) కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో క్వాంటమ్ కంప్యూటింగ్ అనే అంశంపై ఆరు రోజుల పాటు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం 19- న ప్రారంభమై 24 శనివారం వరకు కొనసాగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి డేనియల్ ఫ్రాన్స్వా నిర్వహించారు. క్వాంటం కంప్యూటింగ్ లో పలు సూచనలు, సలహాలను ఈ వర్క్షాప్లో అందివ్వడం జరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ అకాడమిక్స్ డాక్టర్ పి. రవి కుమార్, డీన్ అడ్మిన్ డాక్టర్ వై.కే.ఎస్. సుబ్బారావు, విభాగాధిపతులు డాక్టర్ సి హెచ్. ఎస్. వి. వి. ఎస్. ఎన్. మూర్తి, డాక్టర్ బి. మాణిక్యాల రావు, వర్క్షాప్ కోఆర్డినేటర్స్ మిస్టర్ జె. ఎస్. నరేంద్ర కుమార్, జి. పరమేశ్వర కుమార్ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు

## జగ్గంపేటలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర




**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 24:** జగ్గంపేటలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చంద్రశేఖర్, జగ్గంపేట పంచాయతీ కార్యదర్శి జి.శివ, సీడీపీఓ పూర్ణిమ, ఎంఈఓ సుబ్రహ్మణ్యశ్వర రావు జగ్గంపేట పంచాయతీ కార్యాలయం నుండి ర్యాలీగా గెద్దపేట వీధులలో నివాసులకు చెత్త బయట వేయద్దని తడి చెత్త, పొడి చెత్త డబ్బాలలో వేసి ఉదయం 7 గంటలకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని తెలిపారు. పరిసరాలు పరిశు భ్రంగా ఉంచాలని, జీరో శానిటేషన్, బయట మల విసర్జనకు పూర్తిగా స్వస్తి చెప్పడం, ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి వినియోగాన్ని అలవాటు చేయడంపై వివరించారు. ఇంట్లో ఉన్న మరుగుదొడ్డిని తప్పనిసరిగా ఉపయోగించాలని, పిల్లలకు చిన్ననాటి నుంచే శుభ్రత అలవాట్లు నేర్పాలని తెలిపారు. అనంతరం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సూపరవైజర్ లు సునీత, అమ్మాజీ, అంగన్వాడీ టీచర్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేరవరం పీహెచ్ హైస్కూల్‌లో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా



**ఆత్రేయపురం పెన్ పవర్ జనవరి 24:**కొత్తపేట ప్రాజెక్ట్ పరిధిలోని ఆత్రేయపురం మండలం పేరవరం 2 పీహెచ్ హైస్కూల్‌లో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొత్తపేట ప్రాజెక్ట్ అధికారి ఏ. గజలక్ష్మి ఆదేశాల లో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా మండల సూపర్‌వైజర్లు ఆర్. పద్మావతి, అనాగ ఉత్పమేగి బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. బాలికల సంరక్షణ, విద్య ప్రాముఖ్యత, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల నివారణతో పాటు అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. బాలికలు తమ హక్కులు తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు, జీఎం స్కూల్ సిబ్బంది, ఏఎన్ఎం, అంగన్వాడీ వర్కర్లు, ఎల్ఎంహెచ్‌పీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రభాకర్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి.

- జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్.



**కిర్లంపూడి, పెన్ పవర్, జనవరి 23:** రోడ్డు నిర్మాణం పనుల్లో పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా టిడిపి అధ్యక్షుడు,జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. గత కొంతకాలంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టక ప్రజలు పడుతున్న అవస్థలను చూచి ఎట్టకేలకు జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకవర్గ సభ్యులు జ్యోతుల నెహ్రూ చొరవతో నిర్మిస్తున్న వీరవరం,రాజుపాలెం తారు రోడ్డు పనులను జ్యోతుల నవీన్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ కుమార్ మాట్లాడుతూ గత కొంతకాలంగా రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కృషి వల్ల వీరవరం రాజుపాలెం తారు రోడ్డు పనులను చేపట్టడం జరిగిందన్నారు. రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు, వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ, గంధం ఈశ్వరరావు, గొల్లపల్లి సూరిబాబు,గొడే దొరబాబు, బొదిరెడ్ల సుబ్బారావు,గణేసుల లక్ష్మణరావు,తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు దినోత్సవం




**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 24:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆద్వర్యంలో ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ, మానవహారం మరియు వ్యాసరచన పోటీలను నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఎన్నికల ప్రక్రియలో ఓటు వేయడానికి గొప్ప ప్రాముఖ్యత ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సి. హెచ్. బాలరాజు, ఐ. క్యూ.ఏ.సి కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.వి. సత్యనారాయణ, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏడువారాల వెంకన్న దర్శనానికి వెల్లువెత్తిన భక్తులు



## వాడపల్లి వెంకన్న దర్శించుకున్న రాజకీయ ప్రముఖులు

**ఆత్రేయపురం పెన్ పవర్ జనవరి 24:**"ఏడువారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం" అనే నానుడికి నిదర్శనంగా కొనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రం రోజురోజుకూ అభివృద్ధి చెందుతూ భక్తులతో కిటకిటలాడుతోంది. ఏడువారాల వెంకన్న దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు.

శనివారం వేకువజామున ఆలయ సన్నిధిలో మేలుకొలుపు సేవ, ఐశ్వర్య లక్ష్మి హోమం, సుప్రభాత సేవ, అలంకరణోత్సవం నిర్వహించి స్వామివారి తొలి హారతితో భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్యూలైన్లలో క్రమబద్ధంగా వేచి ఉండి స్వామివారి దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం ఆలయ సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. సాయంత్రం వేళ ఆలయ ప్రాంగణంలో కొవ్వూరు పట్టణానికి చెందిన ధారణ సరస్వతి ఆర్ట్స్ అకాడమీ వారు ప్రదర్శించిన ధర్మపథం కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా రాజకీయ ప్రముఖులు కూడా ఏడువారాల వెంకన్న దర్శనానికి తరలివచ్చారు. కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు కుటుంబ



సమేతంగా శ్రీ స్వామివారిని దర్శించుకోగా, కొత్తపేట జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసు స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి కుటుంబ సభ్యులు శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు.

ఏడువారాల వెంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉపకమిషనర్ తెలిపారు





## కొనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రంలో సినీ నటుడు రంగస్థలం మహేష్ దంపతులు



**ఆత్రేయపురం పెన్ పవర్ జనవరి 24:**కొనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రానికి శనివారం సినీ నటుడు రంగస్థలం మహేష్ దంపతులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం రంగస్థలం మహేష్ మాట్లాడుతూ, ఏడు శనివారాల వెంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఏడేడు జన్మల పుణ్యఫలం లభిస్తుందన్న నమ్మకం ఉందని తెలిపారు. జనసేన అభివృద్ధితో మరింత శోభాయమానంగా మారుతున్న వాడపల్లి క్షేత్రాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

## పాడి రైతులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 24:** పాడి రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు తాతయ్య కోరారు. శనివారం స్థానిక పశు వైద్యశాల వద్ద శిబిరాన్ని నిర్వహించి పశువులకు, కోళ్ళకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ నెల 31 వరకు వైద్య శిబిరాలను గండేపల్లి, జగ్గంపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని ఏడి తెలిపారు. పశువులకు సబ్సిడీపై అందించే దానా, గోకులం షెడ్లు నిర్మాణం, ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు గురించి రైతులకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పశు వైద్య అధికారి రామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## మోడేకుర్రులో స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమం




**కొత్తపేట, పెన్ పవర్, జనవరి24;**మోడేకుర్రు గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాన్ని సమగ్రంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి హాజరై పరిసరాల శుభ్రత, పారిశుధ్య నిర్వహణపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన గ్రామం ఉంటేనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమని ఆమె పేర్కొన్నారు. చెత్తను ఎక్కడికక్కడ పడేయకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పుల్లెల వెంకటేశ్వరరావు, ఆశా వాలంటీర్లు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆదిత్య యూనివర్సిటీలో స్పేస్ సైన్స్‌పై విజ్ఞానదాయకంగా ముగిసిన గెస్ట్ లెక్చర్



**గండేపల్లి, పెన్ పవర్, జనవరి, 24:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో స్పేస్ టెక్నాలజీ మరియు అకాడెమిక్ కార్యకలాపాలు అనే అంశంపై సిబ్బందికి ప్రత్యేక గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీకి చెందిన వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా ఇస్రో మాజీ సీనియర్ సైంటిస్ట్ , హ్యూమన్ స్పేస్‌ఫ్లైట్ (గగన్‌యాన్) ప్రాజెక్ట్‌లో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ హెడ్, టెలిమెడిసిన్ సొసైటీ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, డా. మూర్తి రేమిల్లా, హాజరై స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన కీలక అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ లెక్చర్‌లో శాటిలైట్ వ్యవస్థలు, ఉపగ్రహాల రూపకల్పన, ప్రయోగం (లాంచ్), ఆర్బిట్ నిర్వహణ, డేటా సేకరణ మరియు భూమిపై వివిధ రంగాల్లో ఉపగ్రహాల వినియోగం వంటి అంశాలను డా. మూర్తి రేమిల్లా సులభంగా వివరించారు. కమ్యూనికేషన్ శాటిలైట్లు, రిమోట్ సెన్సింగ్, నావిగేషన్, వాతావరణ అంచనాలు, విపత్తుల నిర్వహణ వంటి రంగాల్లో స్పేస్ టెక్నాలజీ పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. అకాడెమిక్ రంగంలో స్పేస్ సైన్స్ ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో, రీసెర్చ్, ఇంటర్‌డిసిప్లినరీ అధ్యయనాలు, పరిశ్రమవిశ్వవిద్యాలయ భాగస్వామ్యాలు, మరియు విద్యార్థులను భవిష్యత్ స్పేస్ కెరీర్‌లకు సిద్ధం చేయడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత ముఖ్యమని ఆయన సూచించారు. శాటిలైట్ డేటాను బోధన మరియు పరిశోధన లో సమర్థవంతంగా ఉపయోగించుకోవాల్సిన అవసరాన్ని కూడా ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్ మరియు సైన్సెస్) డాక్టర్ ఎ. రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజాబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఐ. వీరాంజనేయులు వ్యవహరించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగ అధ్యాపకుల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## శుభ్రమైన నీరు, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యానికి మూలం ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, పెన్ పవర్, జనవరి24;**కొత్తపేట పట్టణంలోని భవానీ కాలనీలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ్రమైన తాగునీరు, మంచి ఆహారంతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ముందుగా వీధుల్లో స్వయంగా చెత్త ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అందరిచేత స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ మన ఇల్లు శుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నాగరికత పెరిగిన కొద్దీ అనారోగ్యాలు కూడా పెరుగుతున్నాయని, వాటి నుంచి రక్షణకు పరిశుభ్రత అత్యంత అవసరమని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోయిందని, ప్లాస్టిక్ పర్యావరణానికి పెనుభూతమని వ్యాఖ్యానించారు. డ్రెయిన్లలో, రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. కొత్తపేట పంచాయతీని పూర్తిగా పారిశుధ్యంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డ్రెయిన్లలో పేరుకుపోయే చెత్త తొలగించేందుకు జెసిబి కొనుగోలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే డంపింగ్ యార్డ్‌ను పూర్తి చేసి, చెత్తను ఒకేచోట సక్రమంగా నిర్వహించే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. బహిరంగ మలవిసర్జన గణనీయంగా తగ్గిందని, ఇంకా ఎక్కడైనా ఉంటే నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దోమలపై దండయాత్ర ప్రకటించినప్పుడు ప్రతిపక్షాలు హేళనగా మాట్లాడినప్పటికీ, దోమల నివారణ ద్వారా అనేక వ్యాధులు నియంత్రించవచ్చని ఇప్పుడు అందరికీ అవగాహన ఏర్పడిందన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రీసైక్లింగ్ ద్వారా ఇది సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా తడి చెత్త, ఇంట్లోని కూరగాయల వ్యర్థాలు, పేడ వంటి వాటితో సేంద్రీయ ఎరువులు తయారు చేయవచ్చని, బయోగ్యాస్ కూడా ఉత్పత్తి చేయవచ్చన్నారు. బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, చెత్త నుంచి గ్యాస్, విద్యుత్ ఉత్పత్తి చేసే బయోమాస్ పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయని వివరించారు.

పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నియంత్రణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సమయం కేటాయించి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బూసి జయలక్ష్మి భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, మిద్దె ఆదినారాయణ, తమ్మన సాయిప్రసాద్, గనిశెట్టి వీరేష్‌తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం, పెన్ పవర్, జనవరి 24:**ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ లక్ష్య సాధనకు ప్రజలంతా భాగస్వాములు కావాలని కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం పిలుపునిచ్చారు. రామచంద్రపురం పట్టణంలోని శ్రీ రాజీవ్ గాంధీ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవితో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ స్వచ్ఛత ఒక్కరోజు కార్యక్రమం కాదని, అది ప్రతి పౌరుడి నిత్య బాధ్యత అని స్పష్టం చేశారు. పాఠశాల స్థాయిలోనే పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తే భవిష్యత్‌లో ఆరోగ్యకరమైన సమాజం రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు స్వచ్ఛ ఆంధ్రే పునాది అని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాలలు పరిశుభ్రంగా ఉంటే విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు ఆరోగ్య చైతన్యం పెరుగుతుందన్నారు. మున్సి పాలిటీ పరిధిలో స్వచ్ఛత కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన పార్టీ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వచ్ఛతఆరోగ్యంఅభివృద్ధి పరస్పరంగా అనుసంధానమై ఉన్నాయని, ప్రజలంతా భాగస్వాము లైతేనే స్వచ్ఛ ఆంధ్ర సాకారం అవుతుందని అన్నారు. అలాగే ఎస్‌కేపీపీ ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ నారపురెడ్డి బలరాం, గరికపాటి సూర్యనారాయణ, కోమరిన వీర్రాజు, కంచుమర్తి బాబురావు, అల్లం శ్రీనివాస్, జాస్తి విజయలక్ష్మి, బళ్ల లక్ష్మి, దొమ్మల పాటి విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏసుబాబు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 20:** మాచవరం పంచాయతీ పరిధిలోని కామయ్య కోడు తాగునీటి చెరువులో ప్రమాదవశాత్తు పడి నందెపు ఏసుబాబు (40) మృతి చెందాడు. టూ వీలర్‌పై వెళ్తుండగా అదుపు తప్పి చెరువులోకి జారిపడ్డారని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతుని పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## "జీరో-గ్యాప్ శానిటేషన్ ఆంధ్ర" థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్రస్వర్ణ ఆంధ్ర






**ఆత్రేయపురం, పెన్ పవర్ జనవరి 24:**"జీరో-గ్యాప్ శానిటేషన్ ఆంధ్ర" అనే థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్రస్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఆత్రేయపురం బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంపీడీఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకట రామన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, సమగ్ర పారిశుధ్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడం, గౌరవప్రదమైన యాంత్రిక పారిశుధ్య పనులను ప్రోత్సహించడం, అసురక్షిత పారిశుధ్య పద్ధతులను పూర్తిగా నిర్మూలించడం ద్వారా ప్రజారోగ్య ఫలితాలను మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్రస్వర్ణ ఆంధ్ర ర్యాలీని నిర్వహించి ప్రజల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓలు పి.వి.ఆర్.కె. రాజు, కె. రమేష్ బాబు, మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామ స్వరూప్, ఆత్రేయపురం పంచాయితీ కార్యదర్శి ఆర్.వి.వి.ఎస్. ప్రసాద్, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జాబ్ మేళాలో 8 మందికి ఉద్యోగాలు

మంత్రి వాసంశెట్టి సుభాష్




**రామచంద్రపురం, పెన్ పవర్, జనవరి 24:**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో వారం వారం నిర్వహిస్తున్న జాబ్ మేళాలో భాగంగా శనివారం రామచంద్రపురంలో జరిగిన 34వ ఉద్యోగ మేళాలో 8 మంది అభ్యర్థులు వివిధ ప్రముఖ కంపెనీలకు ఎంపికయ్యారు. ఉపాధి మరియు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాలో రాయల్ ఎన్ఫీల్డ్ కంపెనీకి నలుగురు, అపోలో టైర్స్ కంపెనీకి నలుగురు ఎంపికయ్యారు. కంపెనీ ప్రతినిధి కిషోర్ సమక్షంలో ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఎంపికైన అభ్యర్థులు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, ఉపాధి ప్రాజెక్టు డైరెక్టర్ రామ్ కుమార్, అలాగే కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విపత్తులు నిర్వహణపై శిక్షణ.






**పరోపకార లక్షణాలు విద్యార్థి దశ నుంచే అలవరచు కోవాలి : ప్రిన్సిపాల్ డాక్టర్. డి సునీత.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, జనవరి 24:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విపత్తులు నిర్వహణపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ సునీత డిజాస్టర్ మేనేజ్మెంట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విపత్తు నిర్వహణ అనేది ప్రకృతి లేదా మానవ కారణాల వల్ల సంభవించే విపత్తుల నుంచి ప్రజల ప్రాణాలు, ఆస్తిని రక్షించేందుకు చేపట్టే చర్యల సమాహారం. వరదలు, తుఫానులు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు వంటి విపత్తులు అకస్మాత్తుగా సంభవించి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. ఇటువంటి పరిస్థితుల్లో ముందస్తు సిద్ధత, ప్రజలలో అవగాహన ఎంతో కీలకమని అన్నారు . విపత్తు సంభవించి నప్పుడు తక్షణ రక్షణ చర్యలు చేపట్టడం, సహాయక చర్యలను వేగవంతంగా అమలు చేయడం ద్వారా నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. అందుకే ప్రతి పౌరుడు విపత్తు నిర్వహణపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరం కాబట్టి విద్యార్థులందరు శిక్షణ పొంది ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షణ అభియాన్(పిఎం ఉషా ) లో భాగంగా ఎన్ఎస్ఎస్ , రెడ్ రిబ్బన్ క్లబ్ ఆద్వర్యలో ఈ శిక్షణ శిభిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ శిక్షణ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి, కాకినాడ వారిచే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు . ఈ శిక్షణ కార్యక్రమానికి, డా . ప్రయాగ మూర్తి ప్రగడ, కె . సురేశ్ , డా. మదీనా కన్వెనెర్స్ గాను , చిన్ని సత్యనారాయణ రాష్ట్ర విపత్తు నిర్వహణ శిక్షకులుగా కాకినాడ రెడ్ క్రాస్ సొసైటి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి . రామా రావు, డా. శివ ప్రసాద్, శ్రీలక్ష్మి, వీరభద్ర రావు, డా. బంగార్రాజు, సతీశ్, మేరీ రోజలీనా, పుష్పా, రాజేష్ అధ్యాపకేత సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అంబాజీపేట లో విషాదం.. కామయ్యకోడులో పడి వ్యక్తి మృతి



**అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 24:**మాచవరం పంచాయతీ పరిధిలోని పోతాయలంక, కామయ్యకోడు మంచినీటి చెరువులో అదుపుతప్పి మోటార్ సైకిల్ తో సహా పడి నందెపు ఏసుబాబు (40) మృతి. శనివారం ఉదయం టీవీఎస్ ఎక్సెల్ మోటార్ వాహనంపై వెళుతూ ప్రమాదవశాత్తు పడ్డట్టు స్థానికులు చెబుతున్నారు..
ఏసుబాబు మృతి చెందడంతో కుటుంబంలో విషాధం నెలకొంది. యేసుబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇప్పటికే మంచినీడి చెరువులో పడి గతంలో ఇద్దరు మృతి చెందారని అధికారుల నిర్లక్ష్యుశీ కారణంగా చెరువు చుట్టూ సరైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ఇటువంటి ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## కోలంకలో మెగా దంత వైద్య శిబిరం

- 200 మందికి ఉచిత పరీక్షలు
- రూ.10 వేల విలువైన మందుల పంపిణీ




**కాజులూరు పెన్ పవర్, జనవరి 24:**మండల పరిధిలోని కోలంక గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, ఆవరణలో కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా దంత వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరంలో ద్రాక్షారామ భీమేశ్వర డెంటల్ హాస్పిటల్ అధినేత డా. క్రాంతి కుమార్ నేతృత్వంలో సుమారు 200 మందికి పైగా రైతులు, గ్రామస్తులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలకు దంత సంరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా చికిత్స సలహాలు అందించారు. అంతేకాకుండా సుమారు రూ. 10 వేల విలువైన మందులు, టూత్‌పేస్టులు,మౌత్‌వాష్‌లు పంపిణీ చేయడం జరిగింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు దంత ఆరోగ్యంపై చైతన్యం పెంచడమే ఈ శిబిరం ముఖ్య లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కాజులూరు మండల అధ్యక్షులు బొండా వెంకన్న, గ్రామ టీడీపీ అధ్యక్షుడు దాట్ల బుచ్చి వెంకటపతి రాజు, రైతులు, గ్రామ ప్రజలు, జనసేన నాయకులు, తెలుగుదేశం నాయకులు, కూటమి పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు మాట్లాడుతూ, "ఆరోగ్యమే మహాభాగ్యం. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆరోగ్య శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తాం" అని తెలిపారు.

## దేశం గర్వించే విధంగా బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి.



**ఏలేశ్వరం, పెన్ పవర్, జనవరి 24:** దేశం గర్వించే విధంగా బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ ఎన్ ప్రశాంతి అన్నారు. మండల పరిధి లింగంపర్తి గ్రామంలో జాతీయ బాలికల దినోత్సవం శనివారం నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవానికి ప్రశాంతి ముఖ్యఅతిథిగాపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలికలే భవిష్యత్ తరాలకు మార్గదర్శకం కావాలని, నియమ నిబద్ధత విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తే దేశం గర్వించదగ్గ మహిళామణులు మీరే అవుతారన్నారు.
ఈ కార్యక్రమంలో విద్యార్థినులతో ఆడపిల్లను పుట్టనిద్దాం, బతకనిద్దాం ,చదివిద్దాం, ఎదగనిద్దాం అనే నినాదాలను చేయించారు. జె. అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బి శ్రీకాంత్ మాట్లాడుతూ బాలికలు విద్యార్థి దశ నుండే దృఢంగా ఉండడం తద్వారా జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిహెచ్ఓ పి. మాణిక్య కుమారి, హెల్త్ సూపర్వైజర్ కె. దైవకృప, హెల్త్ అసిస్టెంట్ పి. నానిబాబు, ఎమ్ ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, ఆశాలు, విద్యార్థులు ఉన్నారు.

## సూర్య భగవాన్ కి ప్రత్యేక పూజలు

**అంబాజీపేట, పెన్ పవర్ జనవరి 24:**స్థానిక బస్టాండ్ సమీపంలో వేంచేసియున్న వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో సూర్యభగవానుని కి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు ధనూష్ శర్మ ఆధ్వర్యంలో రథసప్తమి ని పురస్కరించుకొని స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్య లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదములు అందచేసారు.



## కోకెనడా హాకి గోల్డ్ కప్2026పై ఇంచార్జ్ కలెక్టర్ అపూర్వభరత్‌తో జాతీయ క్రీడాకారుల భేటీ



**కాకినాడ పెన్ పవర్, జనవరి 24:**సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్‌కు చెందిన జాతీయ హాకీ క్రీడాకారులు శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ అపూర్వభరత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 4 నుంచి 14వ తేదీ వరకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్‌లోని ఆస్ట్రో టర్ఫ్ కోర్టులో నిర్వహించనున్న కోకెనడా హాకీ గోల్డ్ కప్2026 టోర్నమెంట్‌పై ఆయనతో చర్చించారు. కోకెనడా కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో 11 రోజుల పాటు జరగనున్న ఈ మెగా టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా సెంట్రల్ సర్వీసుల్లో పనిచేస్తున్న 15 పురుష జట్లు, 10 మహిళా జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే క్రీడాకారులకు అవసరమైన వసతులు, ఏర్పాట్లపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ టీమ్ చీఫ్ కోచ్, కోకెనడా కోస్టల్ క్లబ్ మేనేజర్ రవిచంద్రప్రసాద్ ఇంచార్జ్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ అపూర్వభరత్ మాట్లాడుతూ కేంద్ర సర్వీసుల్లో విధులు నిర్వర్తిస్తున్న జాతీయ,అంతర్జాతీయ స్థాయి హాకీ క్రీడాకారులు కాకినాడలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనడం శుభపరిణామమని అన్నారు. టోర్నమెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సతీష్ కుమార్, ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ కన్వీనర్ అజయ్ శర్మ, సతీష్, అసిస్టెంట్ కోచ్ ఆనంద్ రత్నకుమార్, కోకెనడా కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు బాబ్జి, రాయల్ క్లబ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యుడు పిసిని నాగబాబు,హాకీ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం.





**400 మంది రోగులకు ఉచిత వైద్య సేవలు.**

**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 24;**మండలంలోని పినపళ్ళ గ్రామంలో కాకినాడ సత్యం స్టడీ సర్కిల్ డైరెక్టర్ బూసి విద్యాసాగర్ నిర్వహణలో ఆయన భార్య ఝాన్సీ రాణి జ్ఞాపకార్థం ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్,అడ్వకేట్ ఆలమూరు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బూసి విద్యా ప్రసన్న వెర్రియ్య దంపతులు శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఈదల సత్తిబాబు, గ్రామ సర్పంచ్ సంగీత సుభాష్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. శ్రీ రమా డెంటల్ క్లినిక్ ,గౌతమి నేత్రాలయ కంటి వైద్యశాల, నారాయణ రెడ్డి వైద్యశాల,మోహన్స్ దయాబెటిస్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొని బి.పి, షుగర్,గుండె, కంటి సంబంధించిన వైద్య పరిక్షలు నిర్వహించి వైద్య సేవలను అందజేశారు. సుమారు 400 మంది రోగులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోగా వైద్యులు ఉచితముగా శస్త్రచికిత్సలు నిర్వహించి ఉచితముగా మందులు పంపిణీ చేశారు. ఈ మేరకు వైద్య సేవలు అందించిన బూసి విద్యాసాగర్ ను, మండల నాయకులు,గ్రామస్తులు ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ సభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వక్కపట్ల లచ్చిబాబు,ఈదల నల్ల బాబు,రామానుజుల శేషగిరిరావు, మానేపల్లి శ్రీనివాస్,ఎంపీడీఓ ఏ రాజు, కొత్తూరి సాయి,ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి రామయ్య,ఉప సర్పంచ్ యణమదల రాణి శ్రీనివాస్,షేక్ అన్సారి,తోట వెంకటేశ్వర్లు,నామాల సుబ్బారావు,గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంకంరెడ్డి రామకృష్ణ కుటుంబానికి ముద్రగడ పరామర్శ.



**కిర్లంపూడి,పెన్ పవర్, జనవరి 24:**రౌతులపూడి మండలం ములగపూడి గ్రామానికి చెందిన అంకంరెడ్డి రామకృష్ణ కుటుంబాన్ని మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభంతోపాటు, ఆయన కుమారుడు ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శనివారం పరామర్శించారు. ములగపూడి మాజీ ఎంపిటిసి అంకంరెడ్డి సతీష్ సోదరుడు అంకంరెడ్డి రామకృష్ణ ఇటీవల కాలధర్మం చెందారు విషయం తెలుసుకున్న ముద్రగడ పద్మనాభం, ముద్రగడ గిరిబాబు ములగపూడిలో రామకృష్ణ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర ప్రగాఢ సంతాపం తెలియజేయడమే కాకుండా, రామకృష్ణ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించి ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని భరోసా కల్పించారు ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులందరికీ భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రౌతులపూడి మండలం పారుపాక గ్రామానికి చెందిన కోసూరి అబ్బాయిరాజు(కోడూరు రాజు ) ఇటీవల మృతి చెందారు విషయం తెలుసుకున్న ముద్రగడ పద్మనాభం, ముద్రగడ గిరిబాబులు అబ్బాయిరాజు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్రప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు. దశాబ్దాల కాలంగా రాజకీయాలకతీతంగా మా వెంటే ఉండి మా కుటుంబ సభ్యుడిగా మెలిగన వ్యక్తి అబ్బాయిరాజు మృతి మా కుటుంబానికి ఎంతో తీరనిలోటన్నారు.ు

## 'ప్రౌడ్ టు బీ అన ఇండియన్' కార్యక్రమానికి ఆహ్వానం సర్పంచ్ దేగల తిరుమల వేణి వెల్లడి



**కాజులూరు, పెన్ పవర్, జనవరి 24:**ఏషియానెట్ న్యూస్ ఎడిటోరియల్ విభాగం నిర్వహిస్తున్న 'ప్రౌడ్ టు బీ అన ఇండియన్' (పీటిబీఐ) కార్యక్రమానికి సంబంధించి న్యూఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌తో పాటు చారిత్రక స్థలాల సందర్శనలకు తనకు ఆహ్వానం అందిందని కాజులూరు మండలం బంధనపూడి గ్రామ సర్పంచ్ దేగల తిరుమల వేణి తెలిపారు. ఈ మేరకు గొల్లపాలెం తిరుమల ఫంక్షన్ హాల్‌లో ఆమె మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 23న వచ్చిన ఆహ్వాన పత్రంలో దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థుల బృందాన్ని న్యూఢిల్లీకి తీసుకెళ్లి గణతంత్ర దినోత్సవ పరేడ్‌ను వీక్షించే అవకాశం కల్పించడం తో పాటు భారత రాజ్యాంగ విలువలు, జాతీయ వారసత్వంపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారని ఆమె చెప్పారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తనకు ఈ ఘనత లభించడం ఆనందంగా ఉందని తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసే అవకాశం రావడం ఎంతో గర్వంగా ఉందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. రెండు రోజుల పాటు ఢిల్లీ నగరంలో పర్యటన ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులతో ప్రత్యేక భేటీలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్‌తో విందు సమావేశం, పెట్రోలియంపర్యాటక శాఖల సహాయ మంత్రి సురేష్ గోపితో అల్పాహార సమావేశం, భారత ఉపరాష్ట్రపతితో అధికారిక భేటీ కార్యక్రమాలు ఉన్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా ప్రధానమంత్రితో సమావేశం, రిట్రీట్ ఈ కార్యక్రమంలో అత్యంత ముఖ్యమైన ఘట్టంగా ఉండనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ కార్యక్రమంలో భాగస్వామిగా అవకాశం లభించడంపై సంతోషం వ్యక్తం చేసిన దేగల తిరుమల వేణి, ఇది విద్యార్థులకు గొప్ప అనుభూతిని,ప్రేరణను అందించే అవకాశమని అన్నారు. 'ప్రౌడ్ టు బీ అన ఇండియన్' కార్యక్రమం ద్వారా యువతలో దేశభక్తి, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన మరింత పెరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పలువురు రాజకీయ నాయకులు, నాగేంద్ర అభిమానులు , గుబ్బల ఏసురాజు,తోట కృష్ణ,వడ్డి శ్రీను, తదితరులు ఆమెకు శనివారం శుభాకాంక్షలు తెలిపారు.

# వరల్డ్ కప్ నుంచి బంగ్లాదేశ్ ను తొలగించిన ఐసీసీ!

**2026 టీ20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్ ఔట్!**

**భారత్‌లో భద్రతా కారణాలతో టోర్నీని బహిష్కరించిన బంగ్లాదేశ్**

**బంగ్లా స్థానంలో స్కాట్లాండ్‌ను ఎంపిక!**



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్‌లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ జట్టును తొలగిస్తున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వర్గాలు తెలిపాయి. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను టోర్నమెంట్‌లోకి తీసుకుంటున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు ఐసీసీ లేఖ ద్వారా తెలియజేసినట్టు తెలుస్తోంది. 2007 నుంచి ప్రతి టీ20 ప్రపంచకప్‌లోనూ ఆడిన బంగ్లాదేశ్ ప్రస్థానానికి ఐసీసీ కఠిన నిర్ణయంతో తొలిసారి బ్రేక్ పడింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నమెంట్‌కు సంబంధించి భారత్‌లో తమ ఆటగాళ్ల భద్రతపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేసింది. ఈ సమస్యలను ఐసీసీ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సరైన పరిష్కారం లభించలేదని ఆరోపిస్తూ, టోర్నమెంట్‌ను బహిష్కరిస్తున్నట్లు బీసీబీ గురువారం ప్రకటించింది. ఈ వివాదాన్ని డిస్ప్యూట్ రిజల్యూషన్ కమిటీకి అప్పగించాలని బీసీబీ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. కమిటీకి అప్పీళ్లపై విచారణ జరిపే అధికారం లేదని, ఐసీసీ తీసుకున్న నిర్ణయమే అంతిమమని స్పష్టం చేసింది. టోర్నీలో ద పాల్గొనకపోతే స్కాట్లాండ్‌తో భర్తీ చేస్తామని ఇచ్చిన అల్టిమేటంపై బీసీబీ నుంచి స్పందన రాకపోవడంతో ఐసీసీ ఈ నిర్ణయాన్ని అమలు చేసినట్టు సమాచారం. దీనిపై ఐసీసీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఈ మార్పుతో స్కాట్లాండ్ జట్టు నేరుగా గ్రూప్ సిలో ప్రవేశిస్తుంది. ఈ గ్రూప్‌లో ఇంగ్లాండ్, వెస్టిండీస్, ఇటలీ, నేపాల్ వంటి జట్లు ఉన్నాయి. స్కాట్లాండ్ తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న కోల్‌కతాలో వెస్టిండీస్‌తో ఆడాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఇటలీ, ఇంగ్లాండ్, నేపాల్‌తో మ్యాచ్ లు ఉన్నాయి. స్కాట్లాండ్ ఇప్పటివరకు ఐదు టీ20 ప్రపంచకప్‌లలో పాల్గొంది. గత రెండు టోర్నీల్లో సూపర్ 8 దశకు చేరుకోలేకపోయినా, పెద్ద జట్లకు గట్టిపోటీనిచ్చింది.

## ముమ్ముందు ఏం జరుగుతుందో మాకు తెలియదు: బంగ్లాదేశ్ క్రికెటర్ షోరిఫుల్ ఇస్లాం

**టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ పాల్గొనడంపై అనిశ్చితి**

**మా పని ఆడటమేనని స్పష్టం చేసిన పేసర్ షోరిఫుల్ ఇస్లాం**

**భారత్‌లో భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్న బంగ్లా క్రికెట్ బోర్డు**

**షెడ్యూల్ మార్చేది లేదని తేల్చిచెప్పిన ఐసీసీ**

**బోర్డు నిర్ణయాన్ని గౌరవిస్తామన్న బంగ్లా క్రికెటర్లు**

**హైదరాబాద్ పెన్ పవర్:** త్వరలో జరగనున్న టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ పాల్గొంటుందా లేదా అనే విషయంపై ఆ దేశ ఫాస్ట్ బౌలర్ షోరిఫుల్ ఇస్లాం స్పందించాడు. ప్రపంచ కప్‌కు వెళ్లాలా వద్దా అనేది తమ చేతుల్లో లేదని, ఆటగాళ్లుగా తమ పని ప్రదర్శనపై దృష్టి పెట్టడమేనని స్పష్టం చేశాడు. భారత్‌తో దెబ్బతింటున్న సంబంధాల నేపథ్యంలో భద్రతా కారణాలను చూపుతూ, తమ జట్టును భారత్‌కు పంపేది లేదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తేల్చిచెప్పింది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని డిమాండ్ చేసింది. అయితే, ఈ ప్రతిపాదనను ఐసీసీ తిరస్కరించింది. షెడ్యూల్ ప్రకారమే భారత్‌లో మ్యాచ్‌లు జరుగుతాయని బుధవారం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ టోర్నీకి దూరమయ్యే అవకాశాలున్నాయనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ వివాదంపై బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో 'ప్లేయర్ ఆఫ్ ది సీజన్' అవార్డు అందుకున్న అనంతరం షోరిఫుల్ మీడియాతో మాట్లాడాడు. "ఆటగాళ్లుగా, మేం ఎలా మెరుగ్గా రాణించాలనే దానిపైనే ఆలోచిస్తాం. ప్రపంచ కప్‌కు వెళ్లడం, వెళ్లకపోవడం అనేది మా చేతుల్లో లేదు. మా క్రికెట్ పెద్దలు తీసుకున్న నిర్ణయాన్ని మేం గౌరవిస్తాం. మా నియంత్రణలో లేని విషయం గురించి ఎక్కువగా మాట్లాడటంలో అర్థం లేదు" అని వివరించాడు.

ఈ విషయం జట్టులో చర్చకు వచ్చిందా, ఆటగాళ్లపై మానసికంగా ప్రభావం చూపుతోందా అని



అడగగా.. "ముమ్ముందు ఏం జరుగుతుందో మాకు తెలియదు. దాని గురించి ఆలోచించడం కంటే మా ఆటపై దృష్టి పెట్టడం మంచిది" అని షోరిఫుల్ బదులిచ్చాడు. ఇటీవలే ముగిసిన బీపీఎల్‌లో చట్టోగ్రామ్ రాయల్స్ తరఫున ఆడిన ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్, 26 వికెట్లతో అద్భుత ప్రదర్శన కనబరిచాడు.

# మళ్లీ గ్రౌండ్‌లోకి మహీ.. నెట్స్‌లో బ్యాటింగ్..

**ఐపీఎల్ 2026 కోసం ప్రాక్టీస్ మొదలుపెట్టిన ఎంఎస్ ధోనీ**

**నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్న వీడియోను పంచుకున్న ఝార్ఖండ్ క్రికెట్ అసోసియేషన్**

**గత సీజన్‌లో సీఎస్‌కే, ధోనీ పేలవ ప్రదర్శన**

**44 ఏళ్ల వయసులోనూ ఐపీఎల్‌లో కొనసాగుతున్న దిగ్గజ ఆటగాడు**

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ... రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ కోసం సన్నాహాలు ప్రారంభించాడు. ఝార్ఖండ్ స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (జేఎస్‌సీఏ) తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియోలో, 44 ఏళ్ల ధోనీ నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. ఈ వీడియోలో ధోనీ, నెట్స్‌కు సిద్ధమవుతూ జేఎస్‌సీఏ కార్యదర్శి సౌరభ్ తివారీతో మాట్లాడుతున్న దృశ్యాలు కూడా ఉన్నాయి. "చూడండి ఎవరు తిరిగొచ్చారో. జేఎస్‌సీఏ గర్వకారణం: మహేంద్ర సింగ్ ధోనీ" అంటూ జేఎస్‌సీఏ ఈ పోస్టుకు క్యాప్షన్ ఇచ్చింది. 2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ, కేవలం ఐపీఎల్‌లో మాత్రమే తన అభిమాన సీఎస్‌కే జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గత ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన నిరాశాజనకంగా ముగిసింది. ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం 4 మాత్రమే గెలిచి పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. బ్యాటర్‌గా ధోనీ కూడా పెద్దగా రాణించలేకపోయాడు. 13 ఇన్నింగ్స్‌లలో 24.50 సగటుతో కేవలం 196 పరుగులు మాత్రమే





చేశాడు. గాయపడిన గైక్వాడ్ స్థానంలో కొన్ని మ్యాచ్‌లకు కెప్టెన్సీ కూడా చేశాడు. ఇప్పటికీ సీఎస్‌కే జట్టులో అత్యంత కీలక ఆటగాడిగా, నాయకత్వ బృందంలో ముఖ్య సభ్యుడిగా ధోనీ కొనసాగుతున్నాడు. తన కెప్టెన్సీలో చెన్నై జట్టుకు ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ అందించాడు. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు 278 మ్యాచ్‌లు ఆడిన ధోనీ, 38.80 సగటుతో 5,439 పరుగులు సాధించాడు. ఇందులో 24 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

# రాజసం ఉట్టిపడేలా.. చీరకట్టులో రాశి ఖన్నా అందాలు..



**ఎంత అందం! సారా అర్జున్ తన లేటెస్ట్ ఫోటోలో చాలా అద్భుతంగా ఉంది**

టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అంటూ భాషతో సంబంధం లేకుండా వరుస భాషా చిత్రాలలో నటిస్తూ మరింత బిజీగా మారిపోయింది ప్రముఖ హీరోయిన్ రాశి ఖన్నా. 2013లో 'మద్రాస్ కేఫ్'అనే సినిమాతో హిందీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తెలుగులో 2014లో అక్కినేని కుటుంబం నటించిన 'మనం' అనే సినిమాలో కేమియో పాత్రలో కనిపించి బాగా ఆకట్టుకుంది. ఆ తర్వాత ఊహలు గుసగుసలాడే సినిమాతో హీరోయిన్ గా భారీ క్రేజీ సంపాదించుకొని జోరు, జిల్, బెంగాల్ టైగర్, సుప్రీం, జై లవకుశ, రాజా ది గ్రేట్, తొలిప్రేమ తదితర చిత్రాలలో నటించి హీరోయిన్గా భారీ పాపులారిటీ అందుకుంది.

సోషల్ మీడియాలో యాక్టివ్ గానే ఉన్న రాశి ఖన్నా బ్లాస్ట్ అయ్యే అందాలతో కుర్రాళ్లను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అప్పుడప్పుడు గ్లామర్ ఫోటోలతో కూడా సడన్ సర్ప్రైజ్ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా చీరకట్టులో మరింత అందంగా ఆకట్టుకుంటోంది. చీరకట్టులో కూడా అందాలను దాస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన ఈమె.. ఈ ఫోటోలు చూసి అభిమానులు లవ్ , ఫైర్ సింబల్ తో వైరల్ చేస్తున్నారు. ఈ అమ్మడు చీరకట్టులో ఫోటోలు తెగ వైరల్ గా మారుతున్నాయి. ఇంకొంతమంది రాజసం ఉట్టిపడేలా చీర కట్టులో ఆకట్టుకుంటోంది అంటూ కామెంట్లు చేస్తున్నారు. రాశి ఖన్నా చివరిగా 2025 లో వచ్చిన 'తెలుసు కదా' అనే సినిమాలో నటించింది. ఈ సినిమా కూడా ఫ్లాప్ గా నిలిచింది. ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే.. పవన్ కళ్యాణ్ తో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో పాటుగా తమిళంలో ఒక సినిమా, హిందీలో మూడు చిత్రాలలో నటిస్తోంది. గతంలో చాలా బొద్దుగా ఉండే రాశి ఖన్నా ఈ మధ్యకాలంలో మరింత స్లిమ్ముగా మారి వరుస అవకాశాలను అందుకుంటోంది. తన పాత్ర నచ్చితే మాత్రం రాశి ఖన్నా సెకండ్ హీరోయిన్గా కూడా నటించడానికి సిద్ధంగానే ఉంటుంది. గతంలో కూడా ఇలా ఎన్నో చిత్రాలలో నటించి మంచి విజయాలను అందుకుంది. ప్రస్తుతం ఈమె ఫోకస్ మొత్తం ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా పైనే పెట్టిందని చెప్పవచ్చు. ప్రముఖ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రాశి ఖన్నాతో పాటు యంగ్ బ్యూటీ శ్రీలీలా కూడా హీరోయిన్గా నటిస్తోంది. ముఖ్యంగా 13 ఏళ్ల తర్వాత మళ్లీ హరీష్ శంకర్ – పవన్ కళ్యాణ్ కాంబో రిపీట్ కాబోతుండడంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఈ సినిమాతో రాశి ఖన్నా కచ్చితంగా బ్లాక్ బస్టర్ విజయం సొంతం చేసుకుంటుందని , ఈ సినిమాతో కచ్చితంగా టాలీవుడ్ లో కం బ్యాక్ అవుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ సినిమా రాశి ఖన్నాకు ఎలాంటి అదృష్టాన్ని తెచ్చి పెడుతుందో చూడాలి.





**రుక్మిణికి స్టైల్‌తో ఎలా మెస్మరైజ్ చేయాలో తెలుసు**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965